ఈనాడు
శ్రీకాకుళం
ఆదివారం 27 ఆగస్టు 2017 16 పేజీలు

ఈనాడు - ఈతరం క్లబ్ ఆధ్వర్యంలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ఎక్స్‌పోర్ట్ - ఇంపోర్ట్ బిజినెస్ వర్క్‌షాప్

వివరాలు 3వ పేజీలో

ప్రేమా.. ఎందుకిలా చేశావ్!!?



పాందూరు రైలు నిలయం వద్ద పద్దెనిమిదేళ్ల విజయ్‌కుమార్, మహాలక్ష్మి ఆత్మహత్య కలకలం రేపింది. బాధిత కుటుంబీకులకు అంతులేని విషాదం నింపిన ఈ ఘటన

వివరాలు 3 లో...

వారే కంటి పాపలు... వారే ఆ ఇంటి ఆశా దీపాలు
అలాంటి 'యువ' మనస్సుల్లోకి నమ్మకంగా చేరావ్
ఏవేవో ఊహలు రేపావ్... ఎన్నెన్నో ఆశలు కల్పించావ్
పెద్దల నోట పెళ్లిప్పుడే వద్దనిపించావ్
మంచి మాటలు చెప్పించావ్!! అయినా ఏం లాభం
అవేవీ వారికి వినపడకుండా భ్రమలు కల్పించావ్
బతికుండి కలిసుండలేరని భయపెట్టావ్
చావులోనైనా ఒక్కటవ్వాలనే పిచ్చి ఆలోచన చొప్పించావ్
వారిరువురినీ కంటికి కనిపించని తీరాలకు తీసుకెళ్లావ్!!
కుటుంబీకుల ఆశల తీరంలో అల్లకల్లోలం రేపావ్!!
నీలోనూ...ఇంత కర్కశం ఉంటుందా...
ప్రేమా...ఎందుకిలా చేశావ్!

-న్యూస్‌టుడే, పాందూరు గ్రామీణం

కవిటిలో ఇలా



కొలమానమా... అనుమానమే!!

● ఇలాగేనా పరికరాల ఏర్పాటు ● వానల వాస్తవ లెక్కలు తెలిసేనా?

వాన చినుకులు పడుతున్న వేళ
జిల్లాలో ఏర్పాటు చేసిన కొలమానాల వైపు చూడండి
గుండెల్లో తుపాను రేగుతుంది
ఒళ్లంతా చెమటలు పడతాయి
కళ్లల్లో నీళ్లు తిరిగినంత పనవుతుంది!
ఇదా...మన అధికారుల పర్యవేక్షణ!
ఇదా...వారి పరిశీలన?
అనిపిస్తుంది!!
ఇక్కడి చిత్రాలు మచ్చుకు ఉదాహరణలే
ఇంకా దారుణమైనవి చూడాలంటే... పదండి 15 లోకి

-న్యూస్‌టుడే, కలెక్టరేట్, బృందం



మందసలో ఇలా


జాతీయ రహదారి పక్కనే ఉన్న మన భూమిని ఎవరైనా ఆక్రమిస్తే?
నిలదీస్తాం...హెచ్చరిస్తాం... తగిన రీతిలో ముందుకెళ్తాం!

జాతీయ రహదారి పక్కనే ఉన్న
మన దుకాణాన్నో...పెట్రోలు బంకు స్థలాన్నో...తోటనో
ఎవరైనా అడ్డదారిలో అమ్మేసుకోవటానికి ప్రయత్నిస్తే...!
ఊరుకుంటామా...చేతులు కట్టుకు కూర్చుంటామా!
ఎట్టి పరిస్థితుల్లో అలా చేయం!

అలా చేసిన వారిపై ఎవరైనా కరుణ చూపిస్తే..
ఆస్తులు తమవి కాదు...ప్రజలవి కదా అని చిన్నచూపు చూస్తే..
నిందితులకు మద్దతుగా నిలిచినట్లు పరిస్థితులు కనిపిస్తే...
ఇక న్యాయం ఎక్కడుంటుంది...అన్యాయానికే రోజులివి అన్నట్లు విమర్శలొస్తాయి!
ఈ 'భూ'కుంభకోణ విచారణా అలాగే కనిపిస్తోంది!!



'ఈనాడు'లో ప్రచురితమైన కథనం



వెనకేసుకొస్తున్నారా!

● 'భూ'తాలకు ఆశ్రయమిచ్చిందెవరు?
● దర్యాప్తు నీరుగార్చే ప్రయత్నమా!
● ఆ నలుగురిపై కేసు నమోదులో జాప్యం

కాశీబుగ్గ, న్యూస్‌టుడే

విశాఖపట్నం జిల్లాలో సంచలనం రేపిన భూముల కుంభకోణం మాదిరిగా పలాస మండలంలోని తోటూరు రెవెన్యూ పరిధిలో అక్రమాలు చోటు చేసుకున్నాయి. ఈ వ్యవహారంపై ఈ నెల మొదటి వారంలో 'భూ'తాలొచ్చాయ్...అంటూ 'ఈనాడు'లో వరుస కథనాలు వెలువడ్డాయి. వీటిపై సంయుక్త కలెక్టర్ చక్రధర్ బాబు స్పందించి దర్యాప్తు నిమిత్తం టెక్కలి ఆర్డీవో వెంకటేశ్వరరావును నియమించారు. పలాస తహసీల్దార్ కార్యాలయంలోని తోటూరు రెవెన్యూ పరిధి దస్త్రాలతో పాటు అంతర్జాలం ద్వారా జరిగిన భూ కుంభకోణానికి సంబంధించిన నివేదికను సంయుక్త కలెక్టర్‌కు ఆర్డీవో నివేదించారు. కుంభకోణానికి పాల్పడిన నలుగురిపై పోలీసు కేసులు నమోదు చేయడానికి సిద్ధపడిన రెవెన్యూ యంత్రాంగం తర్వాత వెనుకడుగు వేసినట్లు కనిపిస్తోంది. ఆ 'భూ'తాలకు ప్రముఖల అండ ఉన్నట్లు విమర్శలొస్తున్నాయి.

పలాస మండలం టెక్కలిపట్నం పంచాయతీ తోటూరు రెవెన్యూ పరిధిలో నందిగాం మండలం బడగాం గ్రామ రైతులకు చెందిన 15 సర్వే నెంబర్లలోని 39.56 ఎకరాల భూమి ఇతరుల పేరున మారిపోయింది. హరిబాబు పేరున 11.83 ఎకరాలు, వెంకటరావు పేరున 8.84 ఎకరాలు, శంకరరావు పేరున 10.49 ఎకరాలు, గున్నమ్మ పేరుతో 8.40 ఎకరాలు భూమిని తప్పుడు నెంబర్లతో ఆన్‌లైన్ అడంగల్‌లో మార్చేశారు. అంతటితో ఆగక విశాఖపట్నానికి చెందిన స్థిరాస్తి వ్యాపారి నుంచి రూ.20 లక్షలు అడ్వాన్స్ తీసుకొని విక్రయానికి (మిగతా 15వ పేజీలో)



మరిన్ని చిత్రాలు 13 లో

ఏకదంతా...
మాలో కొలువుండు ఏడాదంతా!

విఘ్నాధిపతి...పార్వతీపుత్రుడు...గణనాథుడు...ఇలా పలు నామాలతో భక్తుల మనస్సుల్లో కొలువైన వినాయకుడి ఉత్సవాలు సిక్కోలులో ఘనంగా సాగుతున్నాయి. వందలాది మంటపాల్లో ఆ గణేశుడికి ప్రత్యేక అలంకరణలతో పూజలు చేస్తున్నారు. శ్రీకాకుళం జీటీ రోడ్డులో రుద్రాక్షలతో ఏర్పాటు చేసిన ఏకదంతుడ్ని చిత్రంలో చూడొచ్చు.

-న్యూస్‌టుడే, శ్రీకాకుళం సాంస్కృతికం

అమ్మకు ఆరోజే మాటిచ్చా... నెరవేర్చా!

● అమ్మ.. ఆమె.. నా ప్రాణం
● 'సివిల్స్' వైపు నడిపించిన ఘటనలెన్నో
● 'ఈనాడు'తో

ఎస్పీ త్రివిక్రమ వర్మ



వివరాలు 2లో

అమ్మకు ఆరోజే మాటిచ్చా...నెరవేర్చా!

● అమ్మ.. ఆమె.. నా ప్రాణం ● 'సివిల్స్' వైపు నడిపించిన ఘటనలెన్నో
● 'ఈనాడు'తో ఎస్పీ త్రివిక్రమ వర్మ



'వంశధార' పేరు చెబితే సిక్కోలే గుర్తుకొస్తుంది! ఆ ప్రాజెక్టు పనుల నిమిత్తం ఇటీవల మోహరించిన పోలీసు బలగాలే కళ్లముందు కనిపిస్తాయి చాలా సున్నితమైన ఈ అంశంలో ఎస్పీ త్రివిక్రమవర్మ చాకచక్యంగా వ్యవహరిస్తున్నారు! జిల్లాలో బాధ్యతలు చేపట్టిన కొద్ది రోజుల్లోనే ఆయనకు సవాల్ విసిరిన ఈ ఘటన గుర్తుంచుకోదగినదే! మరి...అంతకుముందు ఇలాంటివి ఏమీ లేవా? వైద్య విద్య చదివినా... అసలు సివిల్స్ వైపే ఎందుకు రావాలనుకున్నారు? అమ్మ మాటంటే దైవ వాక్కులా నడచుకునే ఈ ఎస్పీకి ప్రేరణ కలిగించిన ఇతర అంశాలేమిటి? ఆమెకు ఇచ్చిన మాటేంటి... దాన్నెలా నెరవేర్చారు.. తండ్రొకటి తలిస్తే...కుమారునిగా ఈయనేం తలిచారు? ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానం తెలియాలంటే జిల్లా ఎస్పీ త్రివిక్రమ వర్మ అంతరంగాన్ని చదవాల్సిందే. 'ఈనాడు'కు వివరించిన ఆ విశేషాలు ఆయన మాటల్లోనే.

ఈనాడు – శ్రీకాకుళం

ఈనాడు ప్రత్యేకం



మరచిపోలేని ఆనంద క్షణాలవి

పెళ్లయ్యాక ఎనిమిదేళ్లపాటు సంతానం లేదు. ఎంతో మదన పడ్డాం. గర్భం దాల్చినా.. అనేక అవరోధాలు. దాదాపుగా యజ్ఞం చేశాం. మొదటి అమ్మాయి గర్భంలో ఉన్నప్పుడు 8 నెలల పాటు ఆమె మంచం దిగని పరిస్థితి. అమ్మాయి పుట్టినప్పుడు కల్గిన ఆనందక్షణాలు ఎప్పటికీ మరిచిపోలేనివి. రెండో అమ్మాయి మరో కానుక. అంతకు ముందు... మా అన్నయ్య ఏడాది కూతురు మహతిని తెచ్చి అమ్మ మా దగ్గర ఉంచింది. అయిదేళ్లు పెరిగింది. వదినది త్యాగమనే చెప్పాలి. అన్నవదినలిద్దరూ లండన్‌లో పని చేస్తున్నారు. వారి కూతుర్ని మాకివ్వడం.. ఎప్పటికీ మరువలేనిది. మాకు పిల్లలు పుట్టేంతవరకు మాతోనే ఉండేది. మా అమ్మ అడగడం.. ఏడాది పిల్లనే మాకివ్వడం మరచిపోలేని అంశం.

నాన్న కోరిక వేరు

నాన్న, అమ్మ వైద్యులు. నాన్న మెడిసిన్‌లో ప్రొఫెసర్, ఆంధ్రా, గుంటూరు, కర్నూలు మెడికల్ కళాశాలల్లో పని చేశారు. అన్నయ్య, చెల్లి.. నేనూ ఎంబీబీఎస్ చేశాం. సివిల్స్ అంటే నాన్నకు కాస్త భయం ఉండేది. దేశాలు పట్టి తిరుగుతానేమోననే దానికి కారణం. అందుకే ఉదయాన్నే ఆసుపత్రి అప్పజెప్పేవారు. రిటైర్డ్ అయ్యాక చెన్నై వెళ్లిపోయాం. నాన్న.. శంకరనేత్రాలయలో పని చేసేవారు. సివిల్స్‌కు ప్రిపేర్ అవుతానని చెప్పా. ఆయనకు ఇష్టం ఉండేది కాదు. మెడికల్ కళాశాలలో చేర్పించారు. పగలంతా ప్రాక్టీస్ చేసి.. రాత్రి చదువుకో అనేవారు. అది నాకు నచ్చేది కాదు. పెరంబదూర్‌లో రైల్వే ఆస్పత్రి గుండె జబ్బులకు చాలా పేరు. అక్కడ చేర్పించారు. అక్కడా ఇదే నిబంధన. కొన్నాళ్లు పనిచేశాక.. 'నా వల్ల కాదు...దిల్లీ వెళ్లిపోతా. సివిల్స్‌కు ప్రిపేర్ అవుతా. ఎంపిక కాకపోతే చూద్దాం' అని బతిమాలా. దిల్లీ వెళ్లిపోయా. అక్కడే చదువుకున్నా. నాన్నకు డాక్టర్ అంటేనే ఇష్టం. మీ అబ్బాయి జీవితంలో స్థిరపడతాడా...లేదా అని నాన్నను అందరూ అడిగేవారు. 'సివిల్స్‌కు ప్రిపేర్ అవుతున్నాడు' అని చెప్పేవారు. అది మరింత పట్టుదల పెంచింది. మూడో యత్నంలో సివిల్స్ సాధించగలిగా. తొలి ప్రయత్నంలో ఇండియన్ ఇన్ఫర్మేషన్ సర్వీసు (ఐఐఎస్)వచ్చింది. దిల్లీలో రెండేళ్లపాటు ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించా. రెండో ప్రయత్నంలో ఏదీ సాధించలేకపోయా. మూడో ప్రయత్నంలో 201 ర్యాంకు సాధించగలిగా. ఐపీఎస్ సాధించాక. . నాన్న చాలా ఆనందపడ్డారు.

కష్టపడితేనే విజయం: 'కష్టే ఫలి'.. కష్టపడకుండా ఏదీ రాదు. నిరంతర శ్రమతోనే ఏదైనా సాధించొచ్చు. మాటలు చెప్పి.. పైకి వెళ్లిపోవచ్చు అనేవి కలలకే పరిమితం. యువత జడత్వాన్ని వీడాలి.

★ పేరు : **చిత్తారి మాచరోతు త్రివిక్రమవర్మ**
★ ముద్దు పేరు : టుప్పు
★ పుట్టిన తేదీ : 1974, జులై 17
★ జన్మస్థలం : బుధవారం పేట, కర్నూలు
★ తల్లిదండ్రులు : కృష్ణమూర్తి, రాజేశ్వరి
★ అన్న, చెల్లి : మధుసూదన వర్మ (లండన్‌లో కార్డియాలజిస్టు), లలిత వర్మ (అమెరికాలో డాక్టర్)
★ విద్యాభ్యాసం : ఎంబీబీఎస్, కర్నూలు మెడికల్ కళాశాల
★ వివాహం : 2002, డిసెంబరు 15
★ సతీమణి : సువర్ణవర్మ (సోనీ) .. ఎంబీఏ, ఎం.టెక్, (కంప్యూటర్ సైన్సులో పీహెచ్‌డీ)
★ సంతానం : ఇద్దరమ్మాయిలు.. మహిమ్న వర్మ, మరాలి వర్మ.
★ విధులు నిర్వర్తించింది : మహబూబ్‌నగర్‌లో శిక్షణ, రంపచోడవరం ఏఎస్పీ, కరీంనగర్, నర్సీపట్నం ఓఎస్డీలుగా.. తూర్పుగోదావరి ఎస్పీగా.. ఏపీఎస్పీ 8వ బెటాలియన్ కమాండెంటు, డీసీపీ విశాఖ (శాంతి,భద్రతలు), ప్రకాశం ఎస్పీ. జూన్ 26న శ్రీకాకుళం జిల్లా ఎస్పీగా బాధ్యతలు.
★ ఇష్టమైన ఆహారం : చికెన్ ధమ్‌బిరియానీ
★ ఇష్టమైన సినిమా : టైటానిక్
★ ఇష్టమైన ప్రదేశం : సిక్కిం. గాంగ్‌టక్‌లోని కాంచనజంగ పర్వత ప్రాంతం. మళ్లీమళ్లీ చూడాలనిపించే చూడముచ్చటైన ప్రాంతం.
★ నాలో నాకునచ్చినది : ఏదైనా సాధించగలనన్న నమ్మకం
★ నాలో నాకు నచ్చనిది : తిండిపై నియంత్రణ లేకపోవడం. వ్యాయామం చేస్తున్నా.. ఎక్కువ తినేస్తుంటా.
★ నచ్చిన రంగు : కాఫీ బ్రౌన్
★ నచ్చిన ఆహార్యం : జీన్ ఫాంట్.. టీ షర్ట్
★ సతీమణికి నాలో నచ్చిన విషయం : కోప్పడినా వెంటనే మళ్లీ శాంతంగా మాట్లాడటం.
★ నాలో నచ్చని విషయం : చికాకు పడటం, కోపం
★ ఆమెలో నాకు నచ్చే గుణం: చాలాచాలా సర్దుకుపోతుంది
★ నా అదృష్టం.. : మా అమ్మ, నా భార్య.

అదిగో అలా..ఇటొచ్చా!

చిన్ననాటి ఒక ఘటన నాపై చాలా ముద్రవేసింది. సివిల్స్ సాధించేందుకు నాలో ఓ రకమైన ప్రేరణ రేపింది. ఏడో తరగతి చదువుతున్నప్పుడు అమ్మ, నాన్నతో కలిసి ఒకసారి శ్రీశైలానికి వెళ్లాం. మేమంతా సర్వదర్శనం వరుసలో నిల్చొని ఉన్నాం. మరో మార్గంలో నుంచి చాలా మంది మమ్మల్ని దాటుకుని దర్శనం చేసుకుని వచ్చేస్తున్నారు. 'వాళ్లెవరమ్మా' అని అడిగా. వీఐపీలమ్మా.. అని చెప్పింది. పెద్దాడ్నయ్యాక నిన్ను కూడా అలాగే తీసుకెళ్తా అని అమ్మకు మాటిచ్చా. దానికంటే ముందు 'వాళ్ల'లా నేనూ ఎందుకు కాకూడదనే భావన బలంగా నాటుకుపోయింది. అప్పుడే సివిల్స్‌కు వెళ్లాలన్న కోరిక చిగురించింది. తరువాత అమ్మను వీఐపీ దర్శనం చేయించా. చనిపోయే వరకు కూడా అమ్మ చెబుతూ ఉండేది.. ఎప్పుడో తెలిసీ తెలియని వయస్సులో అన్నాడు.. నా కొడుకు నన్ను తీసుకెళ్తానని. . ఎప్పుడూ అలాగే దర్శనానికి తీసుకెళ్తాడు అని. నాన్న ప్రభుత్వోద్యోగి అయినా చిన్నచిన్న క్వార్టర్లే. కర్నూలులో కలెక్టర్, ఎస్పీల బంగ్లాలు చూసేవాడిని. వారికెందుకు అంత పెద్ద ఇల్లు ఉండేది అనిపించేది. అది మరింత ప్రభావం చూపింది. నేను ఎంబీబీఎస్ చదువుతున్నప్పుడు మా ఇంట్లో ఒకాయన అద్దెకు ఉండేవారు. అద్దె చెల్లించేవారు కాదు. ఖాళీ చేయడంలేదు. నాన్నను చాలా ఇబ్బంది పెడుతుంటే.. ఎస్పీకి విజ్ఞాపన చేసేందుకు నాన్న వెళ్తూ నన్నూ తీసుకెళ్లారు. చాలా సేపు వేచి ఉండాల్సి వచ్చింది. ఇవన్నీ సివిల్స్ సాధించాలన్న కాంక్షను ప్రేరేపించాయి.

అమ్మే దైవం..

ఏదైనా అమ్మకు చెప్పాల్సిందే.. అమ్మకు చెప్పందే ఎక్కడికీ వెళ్లేవాడిని కాదు. నాన్నతో పెద్దగా ఉండేవాడిని కాదు. నా మిత్రులందరి పేర్లు అమ్మకు తెలుసు. ఇంటి నుంచి బయటకు వెళ్తే.. అమ్మ పాదాలకు నమస్కారం చేసి వెళ్లాల్సిందే. ఇప్పుడు ఆమె ఫొటోకు దణ్ణం పెట్టుకుని వెళ్తా. ఇప్పటికీ ఇంట్లో కపిలగోవు ఉంది. గోవుకు అరటిపండు, పచ్చిమేత పెట్టాకనే.. బయటకు వెళ్లే అలవాటు. ఇక్కడ కూడా అదే సెంటిమెంటు. నాన్నతో ఎక్కువ సమయాన్ని వెచ్చించలేకపోయా. ఈ విషయంలో చాలా సార్లు బాధపడ్డా.



సమాచారహక్కు చట్టంపై నేడు సదస్సు

పాత శ్రీకాకుళం, న్యూస్‌టుడే: సమాచార హక్కు చట్టంపై ఆదివారం ఉదయం 9 గంటలకు శ్రీకాకుళం నగరంలోని ఎల్ఐసీ కార్యాలయం పక్కన ఉన్న విద్యాధరి బీఈడీ కళాశాలలో సదస్సు నిర్వహిస్తున్నట్లు సహ ప్రచార ఐక్యవేదిక జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జె.శ్రీనివాసరావు, ఎస్.గోవిందరావు ఒక ప్రకటనలో తెలిపారు. సదస్సుకు ఐక్యవేదిక రాష్ట్ర నాయకులు ఎస్.నాగార్జున హాజరవుతారన్నారు. ఆసక్తి ఉన్నవారంతా హాజరుకావాలని వారు కోరారు.

చట్టాలపై మహిళలు అవగాహన పెంచుకోవాలి



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న శ్యామలాదేవి

గార, న్యూస్‌టుడే: చట్టాలపై మహిళలు అవగాహన పెంచుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.శ్యామలాదేవి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ఎక్కువ శాతం నిరక్షరాస్యులు కావడంతో మహిళలకు చట్టాలపై అవగాహన కల్పించేందుకు న్యాయవిజ్ఞాన సదస్సులు దోహదపడతాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు, పిల్లల సంక్షేమంలో పాలుపంచుకుంటున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, స్వయంశక్తి సంఘం సభ్యులు చట్టాలపై అవగాహన కల్పించుకొని ఇతరులకు సహాయపడాలని ఆమె సూచించారు. ప్రస్తుతం కుటుంబ తగాదాలు, ఆస్తి తగాదాలు వంటి కేసులు పేరుకుపోయాయని.. వాటిని లోక్ అదాలత్ ద్వారా పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. బాల్య వివాహాలను అరికట్టడం, గృహహింస నిషేధ చట్టం, వరకట్న నిషేధ చట్టం, స్త్రీలకు సమాన ఆస్తి హక్కు చట్టం, ఉచిత న్యాయ సహాయం, వివాహ రిజిస్ట్రేషన్ వంటి అంశాలపై శ్యామలాదేవి అవగాహన కల్పించారు. గర్భస్థ లింగ నిర్ధరణ పరీక్షల నిషేధ చట్టం గురించి వివరించారు. ఈ చట్టాన్ని అతిక్రమించిన వైద్యులు, గర్భిణీ భర్త, అత్తమామలు కూడా శిక్షార్హులని ఆమె పేర్కొన్నారు. న్యాయ సేవాధికార సంస్థ అమలు చేస్తున్న వివిధ పథకాలపై ఆమె అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎ.సింహాచలం, గార ఎస్సై బి.గణేష్, ఎంపీడీవో పి.కాంతారావు, డీసీపీవో కె.వి.రమణ, సీడీపీవో హైమావతి, న్యాయవాదులు ఇందిరా ప్రసాద్, సీఎస్ ప్రకాశ్‌రావు, ఎంఈవో ఎం.భాస్కరరావు, వెలుగు ఏపీఎం శ్రీధర్‌లతోపాటు మండలంలోని స్వయంశక్తి సంఘాల సభ్యులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

● పొందూరు రైలు నిలయం సమీపంలో ప్రేమ జంట ఆత్మహత్య
● శోకంలో బాధిత కుటుంబీకులు

తొందరపడి.. తనువు చాలిద్దామనుకొని..

పొందూరు గ్రామీణం, సంతకవిటి, న్యూస్‌టుడే:

కలిసి చదువుకుంటున్న వారి మధ్య స్నేహం చిగురించింది.. అది కాస్తా ప్రేమగా మారి పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఏడాదిగా జరుగుతున్న ఈ వ్యవహారం తల్లిదండ్రుల దృష్టికి రెండు నెలల కిందటే రావడంతో ఇరువురిని మందలించారు. పెళ్లి వయస్సు కాదని, చక్కగా చదువుకొని ఉన్నతంగా ఎదగాలని తల్లిదండ్రులు చెప్పిన మాటలు వారికి మింగుడు పడలేదు. అయితే వీరిరువురు తొందరపాటుతో తనువు చాలించాలని నిర్ణయించుకున్నారు. శుక్రవారం తెల్లవారు జామున గుర్తు తెలియని రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డారు. పండగ పూట ఆ రెండు కుటుంబాలకు తీరని శోకాన్ని మిగిల్చారు. అల్లారుముద్దుగా పెంచుకున్న పిల్లలు ఉన్నత చదువులు చదువుకొని ప్రయోజకులు అవుతారనుకున్న కన్న వారి కలలు అడియాసలయ్యాయి. రెండు కుటుంబాలలో విషాదం అలుముకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..

పొందూరు రైలు నిలయం తూర్పు కేబిన్‌కు కిలోమీటరు దూరంలో శుక్రవారం తెల్లవారు జామున 3.15 గంటలకు విశాఖపట్నం-పలాస రైలు మార్గంలో గుర్తు తెలియని రైలు కింద పడి పొందూరుకు చెందిన ఆచంటి మహాలక్ష్మి(18), రాజాం మండలం కొండంపేట గ్రామానికి చెందిన యజ్జిపురపు విజయ్‌కుమార్(మనోజ్)(18)లు బలవన్మరణం పొందారు. శుక్రవారం తెల్లవారు జామున రాజాం మండలం కొండంపేట నుంచి విజయ్‌కుమార్ ద్విచక్ర వాహనంపై పొందూరుకు చేరుకున్నాడు. ముందుస్తు ప్రణాళిక ప్రకారం మహాలక్ష్మిని ద్విచక్ర వాహనంపై ఎక్కించుకొని రైలు నిలయానికి చేరుకున్నారు. రైలు నిలయంలో ద్విచక్ర వాహనాన్ని విడిచిపెట్టి పట్టాల వెంట సుమారు రెండు కిలోమీటర్లు నడుచుకుంటూ వెళ్లి అక్కడి నుంచి తల్లిదండ్రులకు ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు చరవాణిలో సమాచారం పంపించారు. ఇందులో తమ ఇరువురి తల్లిదండ్రుల ప్రమేయం లేదని, తమ సొంత నిర్ణయంతోనే బలవన్మరణానికి పాల్పడుతున్నట్లు ఇరుకుటుంబాల వారి చరవాణిలకు సంక్షిప్త సమాచారం పంపించారు.

జీవనోపాధి కోసం..

నిరంతరం శ్రమించి జీవనం సాగించే కుటుంబం వారిది. 15 ఏళ్ల కిందట జీవనోపాధి కోసం విజయనగరం జిల్లా మెరకముడిదాం మండలం గర్భాం పంచాయతీలోని పోరందరవలస గ్రామం నుంచి యజ్జిపురపు శ్రీనివాసరావు, లక్ష్మీ దంపతులు రాజాంనకు చేరుకున్నారు. అక్కడి పెట్రోలు బంకు సమీపంలో మెకానిక్ షాపు ఏర్పాటు చేసుకొని లారీ మెకానిక్‌గా పని చేస్తున్నారు. సమీపంలోని కొండంపేటలో నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు కుమారులు కాగా ఆత్మహత్యకు పాల్పడిన విజయ్‌కుమార్ పెద్ద కుమారుడు. స్థానిక ప్రైవేటు కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. చదువులో ఉన్నతంగా రాణిస్తున్న కుమారుడు తమకు అండదండగా నిలుస్తాడని ఆ కుటుంబం ఆశించింది. ఎంతో అల్లారుముద్దుగా పెంచడమే కాకుండా కావల్సినదల్లా తల్లిదండ్రులు సమకూర్చేవారు. చేతికి అందివచ్చిన కొడుకు మృతి చెందడంతో వారు జీర్ణించుకోలేకపోతున్నారు. అందరితో స్నేహంగా మెలగడంతో పాటు కుటుంబ సభ్యులు, బంధువులతో కలుపుగోరుతనంగా ఉంటున్నారు. ఆప్యాయత, అనురాగాలతో వారందరికీ దగ్గరయ్యాడు. అతడు మృతి చెందాడన్న వార్త వారికి నమ్మశక్యం కాలేదు.

దూరమైన ఆ ఇంటి మహాలక్ష్మి

ఆ కుటుంబంలో మహాలక్ష్మి ఆఖరి అమ్మాయి కావడంతో అల్లారు ముద్దుగా పెరిగింది. వారి ఇంట్లో ఆర్థికపరమైన ఏ శుభకార్యం చేసినా ఆమె చేతుల మీదుగానే జరిగేది. చిన్నతనం నుంచి ఆమె అంటే ఆ తల్లిదండ్రులకు ఎంతో అభిమానం కావడంతో ఆమె నిర్ణయానికి ప్రాధాన్యం ఇస్తుండేవారు. పొందూరుకు చెందిన ఆచంటి రమేశ్, సుజాత దంపతులకు ముగ్గురు కుమార్తెలు. వీరిలో పెద్ద కుమార్తెకు వివాహం కాగా, రెండో కుమార్తె ఇంజినీరింగ్ చదువుతోంది. మూడో కుమార్తె మహాలక్ష్మి రాజాంలోని ఓ ప్రైవేటు కళాశాలలో బీఎస్సీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. స్టోన్ క్రషర్ నిర్వహిస్తున్న రమేశ్ ప్రతి రోజు మహాలక్ష్మి క్రషర్ వద్ద గల వినాయకుడిని పూజించిన తరవాతనే యంత్రాన్ని ఆన్ చేస్తారు. అలాంటి ఆ ఇంటి మహాలక్ష్మి దూరం కావడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరై విలపిస్తున్నారు. చరవాణికి వచ్చిన సంక్షిప్త సమాచారం చూసి తాను చనిపోయి ఉండదని ప్రేమించిన వ్యక్తితో ఎక్కడికైనా వెళ్లిపోయి ఉంటుందని భావించారు. చివరకు మృతి చెందిన వార్త విన్న తల్లిదండ్రులు సొమ్మసిల్లిపోయారు. మెలకువలోకి వచ్చిన అనంతరం రోదించిన వారిని ఓదార్చడం ఎవరి తరం కాలేదు.

పండగ పూట విషాదం

శుక్రవారం వినాయక చవితి కావడంతో ముందు రోజు ఇరు కుటుంబాల వారు పూజా సామాగ్రిని ఏర్పాటు చేసుకున్నారు. తెల్లవారు జాముకల్లా కుటుంబాల్లో పండగ వాతావరణం నెలకొంది. ఇంతలో చరవాణికి వచ్చిన సమాచారం వారిని ఆందోళనకు గురిచేసింది. అప్పటి నుంచి ఇరువురిని బంధువులు, స్నేహితులతో కలిసి వెతకడం ప్రారంభించారు. ఇంతలో రైల్వే పోలీసులు అందించిన సమాచారంతో ఆ రెండు కుటుంబాలలో విషాదఛాయలు అలముకున్నాయి. దీంతో వారి రోదనలు మిన్నంటాయి.

కేసు నమోదు

పొందూరు రైల్వేనిలయం తూర్పు కేబిన్ వద్ద ఇద్దరు ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సంఘటనా స్థలంలో లభ్యమైన చరవాణి సహాయంతో మృతి చెందినవారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అనంతరం మృతదేహాలను పోస్టుమార్టం కోసం శ్రీకాకుళంలోని రిమ్స్‌కు తరలించారు. శవ పంచనామా అనంతరం పోస్టుమార్టం నిర్వహించి ఇరు కుటుంబాలకు వారి మృతదేహాలను అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు జీఆర్పీ ఎస్సై రవికుమార్ తెలిపారు.

అంత్యక్రియలు పూర్తి

విజయకుమార్ మృతదేహానికి శవ పంచానామా అనంతరం సొంతూరు విజయనగరం జిల్లా మెరకముడిదాం మండలం గర్భాం పంచాయతీలోని పోరందరవలసలో ఈ నెల 25న రాత్రి కుటుంబ సభ్యులు అంత్యక్రియలు పూర్తిచేశారు. అతడి మృతితో గ్రామంలో విషాదం నెలకొంది.


సముద్ర తీరాన్ని పరిశీలిస్తున్న వేప్‌కాస్ కమిటీ ఇంజినీరింగ్ సభ్యులు

హార్బర్ ఏర్పాటుకు స్థల సర్వే ప్రారంభం

బుడగట్లపాలెం(ఎచ్చెర్ల), న్యూస్‌టుడే : ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెం గ్రామం సముద్రతీరంలో ఫిషింగ్ హార్బర్ ఏర్పాటు కోసం శనివారం వేప్‌కాస్ (డబ్ల్యుఏపీసీవోఎస్- వాటర్ అండ్ పవర్ కన్సల్టెన్సీ సర్వీసెస్) లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో ప్రాథమిక స్థల సర్వే చేపట్టారు. వేప్‌కాస్ సంస్థ ఇంజినీర్ పీటీ జోయ్ మాట్లాడుతూ వారం రోజులపాటు స్థానికంగా ఉండి నిర్దేశించిన స్థలానికి నాలుగు వైపులా రెండు కిలోమీటర్లు మేర సర్వే చేస్తామన్నారు. సముద్రంలోనూ రెండు కిలోమీటర్ల మేర సర్వే నిర్వహిస్తామన్నారు. దీనికి స్థానిక మత్స్యకారులు సహకరించాలని కోరారు. ఈ సర్వే నివేదిక ఆధారంగా మరోసారి పూర్తిస్థాయి బృందం వచ్చి నెలరోజుల పాటు సర్వే చేస్తారని వివరించారు. నివేదికల ప్రకారం మినీ లేదా మేజర్ హార్బర్ ఏర్పాటు నిర్ధారిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వేప్‌కాస్ సంస్థ ఇంజినీరు జి.గణేష్, సర్పంచి అల్లుపల్లి రాంబాబు, మత్స్యశాఖ సంయుక్త సంచాలకుడు వి.వి.క్రిష్ణమూర్తి, ఎఫ్‌డీవో సత్యనారాయణ, మత్స్యకారులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై వరుస ప్రమాదాలు

● ట్యాంకరు క్లీనరు మృతి ● ఇద్దరు ఎస్.ఐ.లకు గాయాలు ● పలువురికి గాయాలు


జాతీయ రహదారిపై కొత్తపేట, పాకివలస మధ్య లారీని ఢీకొన్న ట్యాంకరు


నుజ్జయిన పోలీసు పెట్రోలింగ్ వాహనాన్ని తరలిస్తున్న దృశ్యం

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: జాతీయ రహదారిపై శనివారం వేకువజామున జరిగిన రెండు వరుస ప్రమాదాల్లో ఒకరు మృతిచెందగా, ఆరుగురు గాయపడ్డారు. జాతీయ రహదారిపై కోటబొమ్మాళి మండలం కొత్తపేట-పాకివలస మధ్య శనివారం వేకువజామున శ్రీకాకుళం నుంచి ఇచ్ఛాపురం వెళ్తున్న ట్యాంకరు ఎదురుగా అదే మార్గంలో వెళ్తున్న లారీను అతి వేగంగా ఢీకొట్టింది. ప్రమాదంలో ట్యాంకరు డ్రైవర్లు ఇద్దరు, ఒక క్లీనరు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే వీరిని విశాఖపట్నంలోని కేజీహెచ్‌కు తరలిస్తుండగా, ఒడిసా రాష్ట్రం కుర్దాకు చెందిన క్లీనరు నిరంజన్ పాయికర్ మీరా (30) మృతిచెందినట్లు ఎ.ఎస్.ఐ. మెట్ట చంద్రరావు తెలిపారు. మిగిలిన ఇద్దరు డ్రైవర్లు గణేశ్వర ప్రధానో, గోవర్ధన్ బెహరా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు ఆయన తెలిపారు. మరోపక్క రహదారిపై ప్రమాదం జరిగిన ప్రాంతంలో పెట్రోలింగు విధుల్లో ఉన్న శ్రీకాకుళం ఎస్.ఐ. ఎస్.తాతారావు, డ్రైవరు రమణ, హోంగార్డు గోవిందరావుతోపాటు కోటబొమ్మాళి ఎస్.ఐ.జి.నారాయణస్వామి, సిబ్బంది కలిసి ట్రాఫిక్ క్లియర్ చేస్తున్నారు. ఇంతలో శ్రీకాకుళం నుంచి ఇచ్ఛాపురం వైపు (అదే మార్గంలో) అతివేగంగా వచ్చిన కంటైనర్ ఒక్కసారిగా పెట్రోలింగు వాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో విధుల్లో ఉన్న ఇద్దరు ఎస్.ఐ.లు తాతారావు, నారాయణరావుతోపాటు మరో ఇద్దరు సిబ్బంది గాయపడ్డారు. వెంటనే వీరిని కోటబొమ్మాళి సామాజిక ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స నిర్వహించారు. అనంతరం శ్రీకాకుళం ఎస్.ఐ. ఎస్.తాతారావు, సిబ్బందిని శ్రీకాకుళం కిమ్స్‌కు తరలించారు. కోటబొమ్మాళి ఎస్.ఐ. నారాయణస్వామి ఎడమ కాలు, మోచేయికి గాయాలవ్వడంతో స్థానికంగానే చికిత్స అందించారు. పెట్రోలింగు వాహనాన్ని ఢీకొన్న కంటైనర్‌ను నందిగాం సమీపంలో పట్టుకున్నట్లు ఎ.ఎస్.ఐ. చంద్రరావు తెలిపారు. డ్రైవరు పరారీలో ఉండగా, మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నా మన్నారు. ప్రమాదాలపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

చికెన్ ధరలు

బ్రాయిలర్ (బ్యాగ్) లైవ్: 92; డ్రెస్డ్: 139; స్కిన్‌లెస్: 159; **వెన్‌కాబ్:** లైవ్: 93; డ్రెస్డ్: 130; స్కిన్‌లెస్: 153, **సుగుణ:** లైవ్ 94; డ్రెస్డ్: 136; స్కిన్‌లెస్: 160.

ఇచ్ఛాపురం

చవితి వేడుకల్లో అక్షరాభ్యాసం

ఈదుపురం (ఇచ్ఛాపురం), న్యూస్‌టుడే: ఈదుపురం కండ్రవార్డు జడ్పీ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల్లో వినాయక చవితి వేడుకలు ఘనంగా జరిపారు. ఈసందర్భంగా 12 మంది చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని హెచ్ఎంలు కవిరాజురెడ్డి, సుకాంత్‌లిమ్మయి జరిపారు. ఈదుపురం ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం. బెహర గణపతి పూజను విద్యార్థులతో చేయించారు.

గణపతికి ఘనంగా పంచామృతాభిషేకం

ఇచ్ఛాపురం: పట్టణం అచ్చమ్మపేట-త్రినాధపేట కూడలిలో కొలువుదీరిన సిద్ధి బుద్ధి సమేత గణపతి పీఠంలో శనివారం వేడుకగా పంచామృతాభిషేకాలు జరిపారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలలో పురపాలక సంఘం కమిషనరు పూడి రవిబాబు దంపతులు పాల్గొని, స్వయంగా గణపతికి అభిషేకాలను నిర్వహించారు. ఆదివారం భజన కార్యక్రమాన్ని చేపట్టనున్నారు.

ఉండ్రాలయ్యా...దండాలయ్యా..!



ఇచ్ఛాపురం పట్టణం ముడియావీధిలో కొలువుదీరిన సిద్ధి గణపతి

సోంపేట, న్యూస్‌టుడే: వినాయక నవరాత్రి ఉత్సవాలు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో వైభవంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం సోంపేట, బారువ మేజర్ పంచాయతీలతో పాటు ఇతరప్రాంతాలలో నవరాత్రి ఉత్సవ కార్యక్రమాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. బారువ మేజర్ పంచాయతీలో పలుచోట్ల వినాయక నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో సాంస్కృతిక, ఆధ్యాత్మిక ప్రదర్శనలతో ఉత్సవ వాతావరణం కనిపిస్తుంది.



ఇచ్ఛాపురం మండలంలోని తులసిగాంలో కొలువుదీరిన సిద్ధిబుద్ధి సమేత ఏకదంతుడు

వైభవంగా వినాయక నవరాత్రి ఉత్సవాలు

కవిటిగ్రామీణం, కవిటి: వినాయక ఉత్సవాలు మండలంలో అన్నివర్గాల వారు వైభవంగా నిర్వహిస్తున్నారు. కవిటి, ప్రగడపుట్టుగ, జగతి, కుసుంపురం, రాజపురం గ్రామాలలో భక్తులు విగ్రహాలు నెలకొల్పి పూజలు చేస్తున్నారు. కొత్తూరులో భక్తులు తమలపాకులు, కూరగాయలు, బొరివంక పెద్దఒరియా వీధిలో రాళ్లతో తయారుచేసిన విగ్రహాలు ఆకట్టుకుంటున్నాయి.

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: ఇచ్ఛాపురం మండలం, పట్టణ పరిధిలో గణపతి పూజామండపాలు వందల సంఖ్యలో ఏర్పాటయ్యాయి. ప్రతీ పల్లెను సుందరంగా తీర్చిదిద్ది, ఆహ్లాదకరంగా మండపాలు ఏర్పాటుచేశారు. అన్నిచోట్లా విద్యుత్తు అలంకరణం, జీలుగు, అట్టలతో అలంకరణలు చేయడం వలన మండపాలు ఆకర్షణీయంగా రూపుదిద్దుకున్నాయి.



సోంపేట పాతంవీధిలో సింహాద్రి అప్పన్న రూపంలో దర్శనమిస్తున్న విఘ్ననాథుడు

వేడుకగా సామూహిక కుంకుమ పూజలు

తులసిగాం (ఇచ్ఛాపురం): గణపతి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శనివారం తులసిగాం గ్రామంలో ఏర్పాటు చేసిన సిద్ధిబుద్ధి సమేత గణపతి పీఠంలో సామూహిక కుంకుమపూజలు నిర్వహించారు. మొత్తం 108 మంది మహిళలు పాల్గొని, గణపతిని అర్చించారు. సాయంత్రం శాంతిహోమాలను జరిపారు. ఇదే పంచాయతీ ఇన్నేసుపేటలో శుక్రవారం గణపతి పీఠం వద్ద సామూహిక వినాయకవ్రతాన్ని జరిపారు. ఈ కార్యక్రమానికి ఉత్సవ కమిటీ ప్రతినిధులు, గ్రామపెద్దలు సహకరించారు.

జగతి (కవిటిగ్రామీణం) న్యూస్‌టుడే : జగతి బావనవీధిలో వినాయక ఉత్సవాల సందర్భంగా మహిళలు సామూహిక కుంకుమ పూజలు వైభవంగా నిర్వహించారు. అష్టోత్తర, సహస్రనామావాళి, విశేష పూజలు చేపట్టారు. ఈసందర్భంగా నిర్వహించిన లడ్డూ వేలంలో గ్రామవాసి పూడి.ప్రవీణ్ రూ.12,516కు సొంతం చేసుకున్నారు.



ఇచ్ఛాపురం ఆసుపత్రి మార్గంలో కొలువైన భారీ విఘ్నరాజు



ఇచ్ఛాపురం పురపాలకసంఘం సమీపంలో ఆకట్టుకునే అలంకరణలో స్వర్ణగణేషుడు



తులసిగాంలో సామూహిక కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు



ప్రగడపుట్టుగలో పూజలందుకుంటున్న వినాయకుడు



బొరివంకలో రాళ్లుతో తయారుచేసిన వినాయకుడు



ఇచ్ఛాపురం మండలం బొడ్డకాళి గ్రామంలో గ్రామ కళాకారుడు శ్యాం రూపొంచిన విఘ్నేశ్వరుడు



జగతిలో మహిళల కుంకుమ పూజలు

ఘనంగా మదర్ థెరీసా జయంతి



మదర్ థెరిసా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న తులసీదాస్, విద్యార్థులు

తోటూరు (ఇచ్ఛాపురం), న్యూస్‌టుడే: భారతరత్న మదర్‌థెరీసా 107వ జయంతిని పురస్కరించుకొని శనివారం ఇచ్ఛాపురం మండలం, పట్టణ పరిధిలో పలు పాఠశాలల్లో వేడుకలను నిర్వహించారు. స్వర్ణభారతి విద్యాసంస్థల ప్రాంగణంలో థెరీసా చిత్రపటానికి పూలమాల వేసి, జ్యోతిని వెలిగించిన సంస్థ అధ్యక్షులు తులసీదాసు ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లీలాలక్ష్మి, హేమంత్, భవానీ, జాని, ధర్మరాజు, మంజుల పాల్గొన్నారు. తోటూరు గ్రామంలోని శ్రీసత్యసాయి విద్యాలయంలో సంస్థ కార్యదర్శి షాహుకారి లక్ష్మి ఆధ్వర్యంలో థెరీసా జయంతి వేడుకలు జరిగాయి. పురపాలకసంఘ బాలికోన్నత పాఠశాల ఆవరణలో శనివారం సాయంత్రం యుటీఎఫ్ అధ్యక్షులు బి.సూర్యనారాయణ ఆధ్వర్యంలో జయంతిని జరిపారు.



సోంపేట పీకే స్ట్రీట్ పాఠశాలలో మధర్‌థెరిసా జయంతి

సోంపేట, న్యూస్‌టుడే: మదర్‌థెరీసా జయంతి సందర్భంగా సోంపేట పీకే స్ట్రీట్ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయురాలు రాజ్యశ్రీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మదర్‌కు ఘనంగా నివాళులర్పించారు. అన్నార్థులు, నిరుపేదలకు తన జీవితాన్ని అంకితం చేసి చివరివరకు రోగులసేవలో గడిపిన మదర్ ఆశయాలు గొప్పవని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఉపాధ్యాయులు పి.సుజాత, జి.రాజేష్, సురేష్ పాల్గొన్నారు.

బారువ (సోంపేట), న్యూస్‌టుడే: బారువ గాంధీపేటలో ప్రధానోపాధ్యాయుడు జి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు. జింకిభద్ర, రామకృష్ణాపురం, శారదాపురం, మాకన్నపురం, పాలవలస, కొత్తూరు, బట్టిగళ్లూరు, డొంకలూరు, గొల్లూరు పాఠశాలల్లో మదర్‌థెరిసా జయంతి వేడుకలను నిర్వహించి ఆమె గొప్పతనాన్ని విద్యార్థులకు తెలియజేశారు. బెంకిలి మదర్‌థెరిసా యువజన సంఘం ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించి విద్యార్థులకు విద్యాపరికరాలు అందజేశారు.

కంచిలిలో..: కత్తివరం ప్రాథమికోన్నత పాఠశాలలో మదర్‌థెరిసా కార్యక్రమం ప్రధానోపాధ్యాయుడు జి.లక్ష్మినారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉపాధ్యాయులు ఈశ్వరరావు, ప్రేమ్‌కుమార్, లవరాజు థెరీసా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేశరిపడ, అంపురం, జాడుపూడి, పద్మతుల, పెద్దశ్రీరాంపురం పాఠశాలల్లో వేడుకలను నిర్వహించారు.

కవిటిగ్రామీణం, కవిటి : ప్రేమమూర్తి మదర్‌థెరీసా అని ప్రధానోపాధ్యాయులు ఎం.లక్ష్మణరావు, కళ్యాణి పాఠశాల డైరెక్టర్ రాజు అన్నారు. మదర్‌థెరీసా జయంతి కార్యక్రమాన్ని శనివారం బెలగాం జడ్పీఉన్నతపాఠశాల, కళ్యాణి విద్యాసంస్థలలో నిర్వహించారు. థెరీసా విగ్రహానికి పూలమాలలు వేసి సేవారంగంలో థెరీసా కృషిని కొనియాడారు.

డిమాండ్ల సాధనకు రిలే దీక్షలు

సోంపేట, న్యూస్‌టుడే: అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గ్రామ సహాయకులు రిలేదీక్షలు చేపట్టారు. సోంపేట రెవెన్యూ కార్యాలయం పరిధిలో గ్రామసహాయకుల యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు కె.ఢిల్లీరావు, వెంకటరావు, మోహనరావు, నీలకంఠం, చంద్రయ్య, తిరుపతి, తులసమ్మ, బాలమ్మ, నీలమ్మ, రెయ్యమ్మ, కామేశ్వరరావు మాట్లాడుతూ వెట్టిచాకిరీ చేయించుకుంటూ తమ సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం దురదృష్టకరమన్నారు. తక్షణమే తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.



సోంపేట: దీక్షలో పాల్గొన్న వీఆర్‌ఏలు



ఇచ్ఛాపురం: రిలే దీక్షలో వీఆర్‌ఏలు

గాంధీపార్కు (ఇచ్ఛాపురం), న్యూస్‌టుడే: తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం అంగీకరించాలని కోరుతూ, ఇచ్ఛాపురం మండల గ్రామ రెవెన్యూసహాయకులు (వీఆర్ఏలు) రిలే నిరసన దీక్షను చేపట్టారు. మండల తహసీల్దారు కార్యాలయ ఆవరణలో చెట్టుకింద దీక్షను శనివారం ప్రారంభించారు. తమ వేతనం కనీసం రూ.18వేలు చేయాలని, తమను నాల్గోతరగతి ఉద్యోగులుగా పరిగణించాలని, ఖాళీలను భర్తీ చేయాలని, అర్హులకు వీఆర్‌వోలుగా పదోన్నతి కల్పించాలని, తమ జీతాలనను 010 పద్దులో చెల్లించాలని కోరారు. సంఘ అధ్యక్షులు బాడాన సింహాద్రి, తారకేశు, మోహనరావు, నూకరాజు, ఎర్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం

29న వుయ్‌ఫర్‌యూ క్రీడా పోటీలు

సోంపేట, న్యూస్‌టుడే: ఈనెల 29న ద్యాన్‌చంద్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నట్లు వుయ్‌ఫర్‌యు సంస్థ ప్రతినిధులు తెలిపారు. మండలస్థాయిలో నిర్వహించే ఈపోటీలలో ఆసక్తిగల అభ్యర్థులు హాజరుకావాలని వారు సూచించారు. 29వ తేదీ ఉదయం 5.45 నిమిషాలకు 3కె రన్‌తో ఆటల పోటీలు ప్రారంభిస్తున్నామన్నారు.


కొత్తపుట్టుగలో బహుమతులు అందుకుంటున్న విజేతలు

నృత్య పోటీల విజేత తేలుకుంచి

లండారిపుట్టుగ (కవిటిగ్రామీణం): వినాయక ఉత్సవాల సందర్భంగా యాదవసంఘం ఆధ్వర్యంలో కొత్త పుట్టుగలో నిర్వహించిన అంతర రాష్ట్ర బృంద నృత్యపోటీలలో తేలుకుంచి ప్రథమస్థానం కైవసం చేసుకుంది. టెక్కలి(ద్వితీయ) శహాలాలపుట్టుగ(తృతీయ) స్థానాలు కైవసం చేసుకున్నాయి. సోలో విభాగంలో బ్రహపూర్(ప్రథమ) ఇచ్ఛాపురం (ద్వితీయ) బెజ్జిపుట్టుగ (తృతీయ) స్థానాలు కైవసం చేసుకున్నాయి. యాదవసంఘం నాయకులు ఎన్.రామారావు, ఎన్.సోమేశ్వరరావు, అశోక్, అబ్బాయి, దాలయ్య విజేతలకు జ్ఞాపికలు, నగదు బహుమతులు అందజేశారు.

రైలు నుంచి జారిపడిన వ్యక్తికి తీవ్రగాయాలు

బారువ (సోంపేట), న్యూస్‌టుడే: రైలు నుంచి జారిపడిన టి.మాధవరావు అనే వ్యక్తికి తీవ్ర గాయాలైనట్లు రైల్వే పోలీసులు తెలిపారు. శుక్రవారం రాత్రి బారువ రైల్వే గేటు సమీపంలో ఈ సంఘటన జరిగిందని, బాధితుడికి తల, ఇతర భాగాలలో బలమైన గాయాలవడంతో బారువ సామాజిక ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ఒడిశా బ్రహ్మపుర ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. రైల్వే పోలీసులు దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కళాశాల భవనాలు సత్వరం నిర్మించాలి

కవిటి, న్యూస్‌టుడే : ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరైన నూతన భవనాలు సత్వరం నిర్మించాలని జడ్పీటీసీ సభ్యుడు బి.రమేష్, సర్పంచి పి.శేఖర్ అన్నారు. కళాశాల భవననిర్మాణాలకు నిధులు మంజూరైనా ఇటీవల చోటు చేసుకున్న పరిణామాలపై బుధవారం 'ఈనాడు'లో 'కళాశాల అభివృద్ధికి రాజకీయగ్రహణం' శీర్షికన కథనం ప్రచురితం కావడం విధితమే. ఈ నేపథ్యంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఉషోదయసంఘం నాయకులు, గ్రామస్థులు శనివారం కళాశాల ప్రిన్సిపల్, ఉపన్యాసకబృందానికి భవనాలు నిర్మాణం వేగవంతంచేయాలని వినతిపత్రం అందజేశారు.

ఒడియా ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలి

సోంపేట: ఒడియా ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించి ఒడియా విద్యార్థుల విద్యాభివృద్ధికి సహకరించాలని ఆంధ్రప్రదేశ్ ఒడియా ఉపాధ్యాయ సంఘం డిమాండు చేసింది. సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విశ్వనాథ్, బృందావన్‌దొళాయి, ఉపాధ్యక్షులు భాస్కరపాడి, డి.పి.చౌదరి, రామహరిపాడి మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన బదిలీలలో 128 మంది ఒడియా ఉపాధ్యాయులు బదిలీ కోరుకున్నారని, ఈనేపథ్యంలో కొన్ని పాఠశాలల్లో ఖాళీలు భర్తీ అయినా జిల్లాలో ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఖాళీలు ఏర్పడ్డాయన్నారు. ఇప్పటికైనా విద్యాశాఖాధికారులు స్పందించి ఒడియా ఎస్జీటీలకు పదోన్నతులు కల్పించాలని వారు కోరారు.

తీర్మానాలు అమలుకు నోచుకోక ఇబ్బందులు

ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో అధికారులు

(న్యూస్‌టుడే- సోంపేట)

ఆసుపత్రి అభివృద్ధి కమిటీకి సంబంధించిన నిధులు వినియోగించుకోలేని పరిస్థితి ఏర్పడడం దురదృష్టకరమని, గత మూడు సమావేశాలలో ఆమోదించిన తీర్మానాలు అమలుకి నోచుకోలేదని, ఇలాగైతే ఈ సమావేశాలు ఎందుకు నిర్వహిస్తున్నట్లని సామాజిక ఆసుపత్రి వైద్యాధికారి ఎస్.రాజేంద్రప్రసాద్ ధ్వజమెత్తారు. ఆసుపత్రి అభివృద్ధి నిధుల వినియోగంలో జిల్లా అధికారులు వ్యవహరిస్తున్న తీరుని ఆయన ఛైర్మన్ బెందాళం ప్రకాష్‌కు ఫిర్యాదు చేశారు. నిధుల వినియోగానికి అవకాశం ఇవ్వకపోవడంతో చిన్నచిన్న సమస్యలు పరిష్కరించుకోలేని దుస్థితి నెలకొందని దీనిపై ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఇ.లక్ష్మీనారాయణ ప్రత్యేక దృష్టిపెట్టి కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. శనివారం సోంపేట సామాజిక ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం ఛైర్మన్ బెందాళం ప్రకాష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో ఈశ్వరమ్మ, సభ్యుడు బరాటం వైకుంఠరావు, వైద్యాధికారులు పి.శివాజీ, పి.దుర్యోధన, జోగినాయుడు పాల్గొన్నారు. మరుగుదొడ్లు మూతపడడంతో ఆసుపత్రి ప్రాంగణం బహిరంగ మలవిసర్జన కేంద్రంగా మారిందని, నీటి ఇబ్బందుల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సమావేశంలో సూచించారు. డయాలసిస్ రోగులకు సంబంధించిన ఖరీదైన ఎరిత్రోపాయిటిన్ ఇంజక్షన్లు రెండు నెలలుగా అందుబాటులో లేకపోవడంతో పేద రోగులు ఇబ్బందులు పడుతున్నారని ఛైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. డాక్టర్ లక్ష్మినారాయణ మాట్లాడుతూ రోజుకి 22 మంది వరకు డయాలసిస్ సేవలందుకుంటున్నారని, సోంపేట డయాలసిస్ కేంద్రాన్ని రోగులు పూర్తిస్థాయిలో వినియోగించుకొంటున్నారని వివరించారు. వివిధ అంశాలపై జిల్లా ఆసుపత్రుల సమన్వయాధికారి స్పందించడం లేదని, మందుల విషయంలో పలుమార్లు ప్రతిపాదనలు పంపించినా జిల్లాస్థాయిలో చర్యలు తీసుకోకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సభ్యుడు వైకుంఠరావుమాట్లాడుతూ అభివృద్ధి కమిటీ సమావేశాలు, ఇతర కార్యక్రమాల విషయంలో ఛైర్మన్‌తో పాటు సభ్యులకు గౌరవం ఇవ్వడంలేదని, సమావేశాలకు సంబంధించిన సమాచారాన్ని తమకు తెలియజేయడం లేదని ఆరోపించారు. దీనిపై డాక్టర్ లక్ష్మీనారాయణ వివరణ ఇచ్చారు. ఆసుపత్రిలో మరుగుదొడ్లు, మంచినీటి సరఫరా వ్యవస్థ పూర్తిగా ధ్వంసంకావడంతో నెలకొన్న ఇబ్బందులను పరిష్కరించాలని వైద్యులు సూచించారు. ఆసుపత్రి మరమ్మతులు, ఇతర అభివృద్ధి పనులకుగాను రూ.60లక్షలు మంజూరయ్యాయని, త్వరలో పనులు నిర్వహించడం ద్వారా సమస్యలు పరిష్కారమవుతాయని సూపరింటెండెంట్ తెలిపారు.


సోంపేట ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం



ఉత్తమ వైద్యాధికారికి సన్మానం

మందస, న్యూస్‌టుడే : మందస ప్రాథమిక ఆసుపత్రి వైద్యాధికారి తమ్మినేని పాపినాయుడును గ్రామస్థులు, ఆసుపత్రి సిబ్బంది శనివారం ఘనంగా సన్మానించారు. పాపినాయుడు ఉత్తమ వైద్యాధికారిగా ఆగస్టు 15న కలెక్టరు నుంచి అవార్డు పొందిన సంగతి తెలిసిందే. అందుకు గ్రామస్థులు, ఆసుపత్రి సిబ్బంది వైద్యాధికారిని అభినందిస్తూ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించి చిరు జ్ఞాపికను అందజేశారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ అధ్యక్షులు తిరుపతిరావు పాల్గొన్నారు.

మొక్కలతోనే మానవ మనుగడ

కవిటిగ్రామీణం, న్యూస్‌టుడే : మొక్కలతోనే మానవ మనుగడ ఆధారపడి ఉందని జడ్పీటీసీ సభ్యుడు బి.రమేష్, సర్పంచి పి.శేఖర్ అన్నారు. వనమహోత్సవంలో భాగంగా కవిటిలో శనివారం మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభించారు. ప్రతిఒక్కరూ మొక్కల సంరక్షణను బాధ్యతగా తీసుకోవాలన్నారు.


కవిటిలో మొక్కలు నాటుతున్న జడ్పీటీసీ సభ్యుడు, సర్పంచి

పాఠశాల ప్రహరీ నిర్మాణానికి సాయం

కొర్లాం (సోంపేట), న్యూస్‌టుడే: కొర్లాం పంచాయతీ హుకుంపేట ప్రాథమిక పాఠశాలకు ప్రహరీ నిర్మాణం కోసం జాగృతి స్వచ్ఛందసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు రాంబుడ్డి గణపతి ఆర్థికసాయం అందించారు. శనివారం పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పి.ఈశ్వరరావుకు రూ.7వేలు నగదు గణపతి అందజేశారు. స్థానికుల సహకారంతోనే ప్రభుత్వ పాఠశాలలు పటిష్టవంతంగా మారతాయని వక్తలు పేర్కొన్నారు. సంస్థ ప్రతినిధులు కోదండరావు, రామారావు, ముకుందరావు, ఆనందరావు పాల్గొన్నారు.

పిల్లల భోజనం విషయంలో నిర్లక్ష్యం తగదు

లొద్దపుట్టి (ఇచ్ఛాపురం), న్యూస్‌టుడే: విద్యార్థుల మధ్యాహ్నభోజన విషయంలో నిర్లక్ష్యం కూడదని, అలా జరిగితే చర్యలు తప్పవని ఇచ్ఛాపురం ఎంఈవో కురమాన అప్పారావు పేర్కొన్నారు. శనివారం ఇచ్ఛాపురం మండలంలోని లొద్దపుట్టి జడ్పీఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల్లో మధ్యాహ్నభోజన నిర్వహణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా భోజన నిర్వాహకులతో మాట్లాడి, పలు సూచనలు చేశారు. హెచ్ఎం రమణరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఉపాధి బకాయిలు చెల్లించేందుకు కృషి

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా చేపట్టే పనులకు సంబంధించి వేతనాలు, బిల్లులు చెల్లించేందుకే కృషిచేస్తున్నామని జిల్లా నీటియాజమాన్య సంస్థ పథక సంచాలకులు కూర్మారావు పేర్కొన్నారు. శనివారం ఇచ్ఛాపురం వచ్చిన ఆయనను ఎంపీపీ దక్కత డిల్లీరావు, చెల్లించని వైనంపై ఎంపీపీ దక్కత డిల్లీరావు, జడ్పీటీసీ సభ్యులు అంబటి లింగరాజురెడ్డి పీడీని ప్రశ్నించారు. ముఖ్యంగా మరుగుదొడ్డి నిర్మాణాలు పూర్తయినా బిల్లులు రావడం లేదని గ్రామాలలో ప్రజలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారని పీడీకి వివరించారు. సమస్య వాస్తవమేనని, నిధులు రావడంతోనే సర్దుబాటు చేస్తామని పీడీ హామీ ఇచ్చారు. అంతకు ముందు ఉపాధి పనులపై నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొని, మండల అధికారులు, ఏపీఎంలకు సూచనలు చేశారు. ఇచ్ఛాపురం ఉపాధిహామీ పనుల తీరుపై అసంతృప్తి వ్యక్తంచేశారు. పనితీరు మార్చుకోవాలని, లక్ష్యాలను సాధించాలని ఏపీఎం ప్రమీలకు పీడీ సూచించారు. ఎంపీడీవో పి.రామకృష్ణకు సూచనలు చేశారు. అధికారులు గ్రామాలలో పర్యటిస్తే, వాస్తవాలు తెలుస్తాయని, లక్ష్యాల సాధనకు అది దోహదపడుతుందని పీడీ పేర్కొన్నారు. జన్మభూమి కమిటీ సభ్యులు దక్కత కామేశ్వరరావు, లోపింటి దీనబంధురెడ్డి, ఎల్.పద్మనాభం, ప్రకాష్‌చంద్ర మండలో తదితరులు పాల్గొన్నారు.


డ్వామా పీడీ కూర్మారావుతో మాట్లాడుతున్న ఎంపీపీ తదితరులు

నేటి నుంచి ఈ-చలానా!

- అందుబాటులోకి తెచ్చిన పోలీసుశాఖ
- మీ-సేవలో చెల్లింపులు
- చరవాణికి సంక్షిప్త సమాచారం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ త్రివిక్రమ వర్మ


రసీదు వచ్చే పరికరాన్ని చూపుతున్న ఎస్పీ త్రివిక్రమవర్మ

అరసవల్లి, న్యూస్‌టుడే: జిల్లా పోలీసుశాఖ మరో అడుగు ముందుకేసింది. వాహనదారులు అడ్డదిడ్డంగా వాహనం నడిపినా, లైసెన్సు లేకపోయినా, అధిక బరువుతో ఆటోలు వెళ్ళినా, రోడ్డుపై లారీలు అడ్డంగా నిలిపినా పోలీసులు ఇకపై అపరాధ రుసుం విధించనున్నారు. గతంలోలా పోలీసులకు నేరుగా నగదు చెల్లించాల్సిన అవసరం లేదు. ఇకపై ఈ-చలానా ద్వారా మీ-సేవలో జరిమానా చెల్లించారు. ఈ విధానం ఆదివారం నుంచి అమలులోకి వస్తుంది. ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ త్రివిక్రమవర్మ శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆర్టీఏ శాఖతో సమన్వయం ఏర్పర్చుకొని దాడులు నిర్వహిస్తామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనదారులు వాహనాలు నడిపితే వారి నుంచి ఇకపై అపరాధరుసుం వసూలు చేయడం జరగదని, వాహనదారుల లైసెన్సు నెంబరు ఆధారంగా రసీదు ఇస్తామన్నారు. ఆ రసీదు తీసుకుని మీ-సేవకు వెళ్ళి నగదు చెల్లించి.. సంబంధిత పోలీసుస్టేషన్‌లో రసీదు చూపిస్తే వాహనం ఇచ్చేస్తారని ఎస్పీ వివరించారు. జాతీయ రహదారిపై రెండునెలల్లో ప్రమాదాలు తగ్గాయని చెప్పారు. ఒకవేళ నగదు చెల్లించబోమంటూ వాహనదారులు వాగ్వాదానికి దిగితే వాహనం నెంబరు క్రైం అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్కింగ్ సిస్టం (సీసీటీఎన్ఎస్) ద్వారా అంతర్జాలంలో నమోదు చేస్తామని.. ఆ వివరాల ఆధారంగా వాహదారుల చరవాణికి సంక్షిప్త సమాచారం వస్తుందన్నారు. దాని ఆధారంగా మీ-సేవలో నగదు చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. 15 రోజుల్లోగా నగదు చెల్లించకపోతే లేఖ పంపిస్తామని, అప్పటికీ చెల్లించకపోతే వాహనం సీజ్ చేస్తామని స్పష్టం చేశారు. గతంలో అపరాధ రుసుం చెల్లించారా, ఎంత చెల్లించారు, సీ బుక్ ఎవరి పేరుపై ఉంది, వాహనం ఎవరిది, బీమా ఉందా, సిగ్నల్ ఉల్లంఘన చేశారా, తదితర వివరాలు రసీదులో పొందుపర్చుతామని వివరించారు. పోలీసులకు విధులలో సహకరించేందుకు కమ్యూనిటీ పోలీసింగ్ ఆఫీసర్ అనే విభాగాన్ని అమలులోకి తీసుకువస్తున్నట్లు చెప్పారు. నగరంలో, జాతీయ రహదారిపై ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, రాత్రివేళల్లో బీట్లు, రిసెప్షనిస్టులుగా వీరు విధులు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఖాళీగా ఉన్న సమయాలలో విద్యార్థులు విధులకు హాజరవుతారన్నారు. నేరాలు తగ్గించేందుకు ఈ విధానం అమలులోకి తీసుకువస్తున్నట్లు చెప్పారు. ఇటీవల నగరంలోని అంబేడ్కర్ కూడలిలో గల ఇండియన్ బ్యాంకు, రామలక్ష్మణ కూడలిలో ఉన్న ఎస్‌బీఐ ఏటీఎంలలో దొంగతనం చేసేందుకు ప్రయత్నించిన నిందితుడు మైనర్ బాలుడని, అతడిని జువైనల్ కోర్టుకు తరలించనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా వివిధ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన కె.వి.ఆర్. కృష్ణ, సి.హెచ్.మహేశ్వరరావు, ప్రవీణ్‌లను అభినందించి రివార్డులు అందజేశారు. సమావేశంలో డీఎస్పీలు భార్గవరావు నాయుడు, కృష్ణమూర్తినాయుడు, సీఐ తిరుపతిరావు, ఎస్ఐ రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

పోటెత్తిన వినతులు

యూత్, కులవృత్తి ప్యాకేజీకి తరలి వచ్చిన నిర్వాసితులు


వంశధార నిర్వాసితుల నుంచి వినతులు స్వీకరిస్తున్న సంయుక్త కలెక్టర్ కె.వి.ఎన్.చక్రధరబాబు


సంయుక్త కలెక్టర్ ఛాంబర్ వద్ద నిర్వాసితులు

కలెక్టరేట్ (శ్రీకాకుళం), న్యూస్‌టుడే: వంశధార నిర్వాసితుల కోసం నిర్వహించిన ప్రత్యేక ఫిర్యాదుల విభాగానికి అధిక సంఖ్యలో నిర్వాసితులు తరలివచ్చారు. ప్రధానంగా యూత్ ప్యాకేజీ కుల వృత్తులకు సంబంధించి నిర్వాసిత గ్రామాల నుంచి మహిళలు, యువత వచ్చారు. ప్రతి సోమవారం నిర్వహించే ఫిర్యాదుల విభాగం స్థాయిలో నిర్వాసితులు వచ్చి తమ సమస్యలను సంయుక్త కలెక్టర్ కె.వి.ఎన్ చక్రధరబాబుకు విన్నవించారు. శనివారం కలెక్టరేట్‌లోని జేసీ ఛాంబర్‌లో సంయుక్త కలెక్టర్ వినతులను స్వీకరించారు. ఇరపాడు, పాడలి గ్రామాలతో పాటు నిర్వాసిత గ్రామాల నుంచి ఇళ్ల ప్యాకేజీలు, యూత్ ప్యాకేజీలు, భూముల పరిహారానికి సంబంధించి వినతులు వచ్చాయి. వివిధ సమస్యలను జేసీకి విన్నవించేందుకు 100 మందికి పైగా నిర్వాసితులు వచ్చారు. సమస్యలను పరిశీలించి నిబంధనల మేరకు పరిష్కరిస్తామని జేసీ తెలిపారు.

నిషేధాజ్ఞలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు

హిరమండలం, న్యూస్‌టుడే : వంశధార నిర్వాసిత గ్రామాల్లో నిషేదాజ్ఞలు కొనసాగుతున్నాయని, వాటిని ఉల్లంఘించి వ్యవహరిస్తే కేసులు తప్పవని పాలకొండ ఇన్‌ఛార్జి డీఎస్పీ వి.సుబ్రహ్మణ్యం అన్నారు. శనివారం హిరమండలం పోలీస్ స్టేషన్‌లో ఆయన పత్రికా విలేకరులతో మాట్లాడారు. ఈనెల 16న నిర్వాసితులు జరిపిన ఆందోళనలో చట్టాన్ని ఉల్లంఘించి వ్యవహరించారని ఈ సంఘటనలో ఇంతవరకు 28మందిపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఈఘటనలో వీడియో పుటేజీలు, కెమేరా చిత్రాల ఆధారంగా ఆందోళన కారులను గుర్తిస్తున్నామన్నారు. 200మందికి పైగా నిర్వాసితులపై కేసులు నమోదు చేయనున్నట్లు తెలిపారు.


సమీక్షిస్తున్న డీఎస్పీ వి.సుబ్రహ్మణ్యం, సీఐ బీఎస్ఎస్ ప్రకాష్,ఎస్సై కె.వెంకటేశ్వరరావు.

పార్టీల నాయకులు గానీ, ఇతర వర్గా వారుగాని గ్రామాల్లోకి వచ్చి రెచ్చగొట్టేలా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. శనివారం నిర్వాసితులను రెచ్చగొట్టేలా సీపీఎం పార్టీ ఖరపత్రాలను పంచుతున్న ఒకరిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిర్వాసిత గ్రామాల్లో ఆర్.ఆర్ ప్యాకేజీలు, పునరావాసం, నష్టపరిహారాల్లో అక్రమాలు జరిగాయంటూ కొంతమంది బాధితులు ఫిర్యాదులు అందజేశారని డీఎస్పీ తెలిపారు. వారి ఫిర్యాదుల మేరకు నిర్వాసిత గ్రామాల్లోని రాంప్రసాదు, సురేష్, గిరి, భాస్కరరావు, పోలినాయుడు, ప్రకాశరావు, శాంతారావు, అప్పన్న, సింహాచలం, శ్రీనులపై కేసు నమోదు చేసామన్నారు. దర్యాప్తు చేసి వాస్తవాలు రుజువైతే అరెస్టు చేస్తామన్నారు. నష్టపరిహారాలు పంపిణీ, పునరావాసంలో ఎవరికైనా అన్యాయం జరిగితే ప్రతి శనివారం కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నిర్వాసితుల ఫిర్యాదుల విభాగంలో వినతులు అందజేయవచ్చుని డీఎస్పీ తెలిపారు. డీఎస్పీతో పాటు పాతపట్నం సీఐ బీఎస్ఎస్ ప్రకాష్, ఎస్సై కె.వెంకటేశ్వరరావు ఉన్నారు.

అందరివాడికి

ఆత్మీయ సత్కారం







విమానాశ్రయంలో వెంకయ్యనాయుడికి స్వాగతం పలుకుతున్న కేంద్రమంత్రులు అశోక్‌గజపతిరాజు, సుజనా చౌదరి, సభాపతి కోడెల శివప్రసాదరావు





ఉప రాష్ట్రపతిగా ఎన్నికైన తరువాత శనివారం తొలిసారి ఆంధ్రప్రదేశ్‌కు వచ్చిన ముప్పవరపు వెంకయ్యనాయుడికి రాజధాని వాసులు ఘనంగా స్వాగతం పలికారు. ఊరూవాడా ఏకమై.. చిన్నాపెద్దా కలిసి వచ్చి.. కరతాళధ్వనులతో ఆయన రాకను వేడుకగా నిర్వహించారు. దారి పొడవునా.. విద్యార్థులు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ.. చేతులలోని జాతీయ పతాకాలను ఊపుతూ జేజేలు పలికారు. వెంకయ్య అందరికీ అభివాదం చేస్తూ గవర్నర్ నరసింహన్, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడితో కలసి ఓపెన్‌టాప్ వాహనంలో ముందుకు సాగారు.

– ఈనాడు, అమరావతి



గజమాలతో వెంకయ్యకు సత్కారం



గవర్నర్ నరసింహన్, సీఎం చంద్రబాబులతో ఉపరాష్ట్రపతి వెంకయ్య ముచ్చట్లు



సచివాలయం వద్ద జరిగిన సత్కార సభలో వెంకయ్యనాయుడుకి ఆశీర్వచనాలు అందిస్తున్న తితిదే వేదపండితులు



మోదీ మాస్క్‌తో అభిమాని





మార్గ పొడవునా విద్యార్థుల స్వాగత హేల



విమానాశ్రయం నుంచి ప్రదర్శనగా వెళుతున్న వెంకయ్య





గన్నవరం నుంచి విజయవాడ వరకు జాతీయపతాక రెపరెపలు



తప్పెట గుళ్ల కళాకారుల ఉత్సాహం

ఉపరాష్ట్రపతికి ఘన స్వాగతం..

ఉప రాష్ట్రపతి ర్యాలీ గన్నవారం విమానాశ్రయం నుంచి ప్రారంభమైంది. పాఠశాల విద్యార్థులు ఉదయం 8గంటలకే రహదారుల పైకి చేరుకున్నారు. క్రమ శిక్షణతో మెలిగి.. రహదారికి పక్కగా వరుసగా నిలబడ్డారు. విమానాశ్రయం వీఐపీ ద్వారం వద్ద నుంచి ప్రారంభించి.. స్వాగత ఏర్పాట్లు అట్టహాసంగా చేశారు. వందలాది కళాకారులు నృత్యాలు, విచిత్ర వేషధారణలు, విన్యాసాలు, ప్రదర్శనలతో ఉపరాష్ట్రపతిని ఆహ్వానించారు. సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా కళాకారులు పగటి వేషాలు, జానపద, గరగ నృత్యాలు, పులివేషాలు, గిరిజన కొమ్ము నృత్యాలు, తప్పెటగుళ్లు, డ్రాగన్లతో ప్రదర్శనలను దారి పొడుగునా ఏర్పాటు చేశారు. గ్రామీణ డప్పు వాయిద్య కళాకారులు, కోలాట కళాకారులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. గన్నవరం విమానాశ్రయం వద్ద ప్రారంభంలో సెయింట్ జాన్స్ విద్యార్థులు తమ బ్యాండ్‌తో ఆకట్టుకున్నారు. బందరు రోడ్డులో సిద్ధార్థ మహిళా కళాశాల విద్యార్థినులు తమ బ్యాండ్‌తో అదరగొట్టారు. ఇలాగే దారిలో విద్యార్థులు ఎక్కడికక్కడ ఉత్సాహంగా స్వాగత వేడుకల్లో పాల్గొన్నారు.

దారి పొడవునా జేజేలు

గన్నవరం విమానాశ్రయం నుంచి ప్రారంభమైన ర్యాలీ నెమ్మదిగా.. సాగుతూ ముందుకెళ్లింది. 23 కిలో మీటర్ల మేర విద్యార్థులు, ప్రజలు, నాయకులు ఉండడంతో అందరినీ పలకరిస్తూ.. ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, గవర్నర్ నరసింహన్, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఓపెన్‌టాప్ వాహనంలో ముందుకుసాగారు. దీంతో విమానాశ్రయం వద్ద ఉదయం 9.20 నిమిషాలకు ప్రారంభమైన ర్యాలీ.. విజయవాడ ప్రకాశం బ్యారేజీ సమీపంలో ఉన్న శనీశ్వరాలయం వద్దకు చేరుకునే సరికి రెండు గంటలకు పైగా సమయం పట్టింది. జాతీయ రహదారి మీదుగా సాగిన ర్యాలీ రామవరప్పాడు చౌరస్తా, ఎన్టీఆర్ విశ్వవిద్యాలయం, రమేష్ ఆసుపత్రి మీదుగా బెంజిసర్కిల్‌కు చేరుకుంది. అక్కడి నుంచి బందరు రోడ్డులోనికి ప్రవేశించి.. ఇందిరాగాంధీ స్టేడియం, స్వరాజ్యమైదానం, పోలీస్ కంట్రోల్‌రూం ముందున్న పైవంతెన మీదుగా.. మున్సిపల్ కార్పొరేషన్ ముందునుంచి సాగింది. బెంజిసర్కిల్ వద్ద భారీగా సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. కత్తి, కర్రసాముతో పాటూ అన్ని రకాల కళాకారులు తమ ప్రదర్శనలతో స్వాగతం పలికారు. మధ్యలో అక్కడక్కడా వాహనాన్ని ఆపి.. స్థానిక నాయకులు వెంకయ్యనాయుడిని సత్కరించారు. ప్రకాశం బ్యారేజీ వద్ద తెదేపా, భాజపా నాయకులు స్వాగతం పలికారు. అక్కడితో.. ఓపెన్‌టాప్ స్వాగత ర్యాలీ ముగిసింది. అనంతరం వెలగపూడి సచివాలయం చేరుకున్న వెంకయ్యకు రాష్ట్ర ప్రభుత్వం తరపున పౌర సన్మానం చేశారు. కార్యక్రమంలో గవర్నర్ నరసింహన్, ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు , ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



ఆకట్టుకున్న గిరిజన నృత్యం



ప్రదర్శనలో ఆకర్షణగా నిలిచిన గిరిజన యువతులు



మత్స్యకారుల వేషధారణలో విద్యార్థులు



బేతాళ నృత్యాల సందడి



బ్యాండ్ బాజారే



జూనియర్ ఇంటర్ స్టడీప్లాన్

వృక్షశాస్త్రం

ప్రతిభ

వృక్షశాస్త్రం పరిచయం అవసరం లేని శాస్త్రం. ప్రతి ఒక్కరూ జీవితంలో మొక్కల గురించి ఎంతో కొంత తెలుసుకునే ఉంటారు. వృక్షశాస్త్ర అధ్యయనం ద్వారా ప్రస్తుతం పర్యావరణంలో చోటుచేసుకుంటున్న కాలుష్యాన్ని నివారించేందుకు భావి తరాన్ని సంసిద్ధం చేయొచ్చు. మనం జీవించడానికి అతి ముఖ్యమైన ఆక్సిజన్‌ను అందించే మొక్కల పట్ల సహజమైన ఆసక్తి ఉన్న విద్యార్థులెవరైనా పరీక్షల్లో మంచి మార్కులు సాధించగలరనడంలో సందేహం లేదు.

అవగాహనతోనే అనుకున్న మార్కులు...

ఇంటర్మీడియట్ బైపీసీ గ్రూపు మొదటి సంవత్సరం విద్యార్థులు వృక్షశాస్త్ర అధ్యయనంలో కొన్ని మెలకువలు తెలుసుకుంటే వారు పబ్లిక్ పరీక్షలు, నీట్, ఎంసెట్‌కు తగిన విధంగా సంసిద్ధం కావచ్చు. అన్ని విజ్ఞాన శాస్త్ర విభాగాల్లాగే వృక్షశాస్త్ర అధ్యయనానికి కావాల్సిన ప్రాథమిక లక్షణాలు "పరిశీలన, విశ్లేషణ." సిలబస్‌లో చదువుకునే అనేక విషయాలను మన చుట్టూ ఉండే మొక్కల్లో పరిశీలించి విషయ జ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చు. బొమ్మలు గీసి, భాగాలను గుర్తించడం లాంటి నైపుణ్యాలను పెంపొందించుకుని, విషయ విశ్లేషణ చేసి పాఠ్యగ్రంథం (text book)ను పూర్తిగా అనుసరిస్తే పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించవచ్చు. IPE - 2018 కి తయారయ్యే మొదటి సంవత్సరం విద్యార్థుల కోసం కొన్ని సూచనలు...

★ మొదటగా బాటనీ (వృక్షశాస్త్రం) I సిలబస్‌ను పరిశీలిస్తే మొదటి సంవత్సర పాఠ్యపుస్తకంలో 7 యూనిట్‌లు, వీటిలో 13 అధ్యాయాలు (Chapters) ఉంటాయి. సిలబస్‌లోని అన్ని అధ్యాయాలు ముఖ్యమైనవే. అవగాహన కోసం పుస్తకంలోని ప్రతి వాక్యాన్ని చదివి, సొంతంగా నోట్సు రాసుకుంటే మంచిది. ఎన్నో రకాల స్టడీ మెటీరియల్స్, గైడ్స్ అందుబాటులో ఉన్నా పాఠ్యపుస్తకాన్ని పూర్తిగా అవగాహన చేసుకుంటేనే విద్యార్థులు IPE, NEET, EAMCET లో అత్యధిక మార్కులు పొందగలుగుతారు.

IPE ప్రశ్న పత్రాలను పరిశీలిస్తే ప్రశ్నల స్వరూపం, మార్కుల వెయిటేజీ కొంత వరకు తెలుసుకోవచ్చు. కింద ఇచ్చిన వెయిటేజ్ టేబుల్ గతంలో జరిగిన పరీక్షల్లోని ప్రశ్నపత్రాల ఆధారంగా రూపొందించింది. ప్రశ్నపత్రంలో పేపర్ సెట్టర్‌లు మార్పులు చేసే వీలుంటుంది/ లేదా ప్రశ్నల వెయిటేజీలో మార్పులు చేసి ఇవ్వొచ్చు. ఇది కేవలం విద్యార్థుల అవగాహన కోసం మాత్రమే.

యూనిట్	అధ్యాయాలు (Chapters)	2 M	4 M	8 M	మొత్తం
I	1-4	3(6)	2(8)	-	14
II	5	2(4)	-	1(8)	12
III	6,7	-	1(4)	1(8)	12
IV	8	1(2)	1(4)	-	06
V	9, 10, 11	3(6)	2(8)	-	14
VI	12	-	1(4)	1(8)	12
VII	13	1(2)	1(4)	-	06
					76

యూనిట్ - I

ఇందులో జీవప్రపంచంలో వైవిధ్యం అనే యూనిట్‌కు సంబంధించి నాలుగు అధ్యాయాలు ఉన్నాయి. ఈ అధ్యాయాల్లో జీవశాస్త్రంలోని మౌలిక అంశాలు, జీవుల వైవిధ్యం, విట్టేకర్ అయిదు రాజ్యాల వర్గీకరణ, వృక్షశాస్త్ర ఆవశ్యకత, పరిధి, వృక్షశాస్త్ర విభాగాలు మొదలైన అంశాలను చర్చించారు. లైకెన్‌ల లాంటి ప్రత్యేకమైన జీవుల గురించి, వైరస్‌లు, బ్యాక్టీరియా, సయనో బ్యాక్టీరియా, మైకోప్లాస్మాలు, విరాయిడ్‌లు లాంటి జీవుల గురించి ఆసక్తికరమైన విషయాలు తెలుసుకుంటారు. వృక్షరాజ్యంలోని శైవలాలు, బ్రయోఫైట్లు, టెరిడోఫైట్లు, వివృతబీజాలు, ఆవృత బీజాలు లాంటి మొక్కల లక్షణాలు, పోలికలు, తేడాలు తెలుసుకుంటారు.

★ **పరీక్షల కోసం:** ఈ అధ్యాయాల్లో సుమారు 48 అతి స్వల్ప సమాధాన ప్రశ్నలు ఉన్నాయి. వీటన్నింటిని తప్పనిసరిగా అధ్యయనం చేయాలి. ఈ విభాగం నుంచి కనీసం మూడు 2 మార్కుల (అతి స్వల్ప సమాధాన తరహావి) ప్రశ్నలు వచ్చే వీలుంటుంది. కాబట్టి వీటిని నాలుగు/ అయిదు అసైన్‌మెంట్లుగా విభజించుకుని నేర్చుకోవచ్చు. అదే విధంగా ఈ విభాగంలో కనీసం 2 స్వల్ప సమాధాన ప్రశ్నలు (స్వల్ప సమాధాన తరహా) పరీక్ష పత్రంలో కనిపించే అవకాశముంది. వర్గీకరణ సహాయకాలు, ద్వినామ నామీకరణం, యూగ్లినాయిడ్‌లు, క్రైసోఫైట్లు, డైనోఫ్లాజల్లేట్‌ల లక్షణాలు, శైవలాలు, బ్రయోఫైట్లు, శిలీంధ్రాల ఆర్థిక ప్రాముఖ్యత, ఎరుపు/ గోధుమ శైవలాల మధ్య తేడాలు, లివర్‌వర్ట్‌లు/ మాస్‌లు, ఏకదళ బీజాలు/ ద్విదళ బీజాల మధ్య తేడాలు, వ్యవసాయ, ఉద్యాన, ఔషధ రంగాల్లో వృక్షశాస్త్ర పరిధి లాంటి అంశాలకు సంబంధించిన ప్రశ్నలు బాగా అధ్యయనం చేయాల్సి ఉంటుంది.

యూనిట్ - II

అధ్యాయం- 5 పుష్పించే మొక్కల స్వరూపశాస్త్రం. దీనిలో ప్రధానంగా కాండం, వేరు, పత్రాలు లాంటి శాఖీయ భాగాలు, పుష్పం, ఫలం లాంటి ప్రత్యుత్పత్తి భాగాల స్వరూపం, రూపాంతరాలు, పుష్పవిన్యాస రకాలకు సంబంధించిన వర్ణన ఉంటుంది. ప్రయోగాలపరంగా ఈ అధ్యాయం చాలా ముఖ్యమైంది, ఆసక్తికరమైంది. పుస్తకంలోని అనేక ఉదాహరణలు మనం ప్రత్యక్షంగా చూసే వీలుంటుంది. ప్రయోగశాలలోని స్పెసిమెన్‌లను పరిశీలించి, వీటి లక్షణాలను బాగా అధ్యయనం చేయొచ్చు.

★ ముఖ్యంగా వేరు రూపాంతరాలు, కాండ రూపాంతరాలు, అనిశ్చిత పుష్ప విన్యాసం రకాలు లాంటి 8 మార్కుల ప్రశ్నలు (దీర్ఘ సమాధాన ప్రశ్నలు) తప్పనిసరిగా నేర్చుకోవాలి. వీటికి సంబంధించి పటాలను గీసి, భాగాలను గుర్తించాలి. వీటికి కనీసం 3 మార్కులు కేటాయిస్తారు (జవాబు రాసినందుకు 5 మార్కులు). ఈ అధ్యాయంలోని 24 రెండు మార్కుల ప్రశ్నలకు సమాధానాలు నేర్చుకున్నట్లయితే పరీక్షలో కనీసం రెండు ప్రశ్నలు రాయగలుగుతారు. మొత్తానికి ఈ విభాగం నుంచి తప్పనిసరిగా 8 మార్కుల ప్రశ్నలు, 2 మార్కుల ప్రశ్నలు అధ్యయనం చేయాలి. పటాలు గీసే నైపుణ్యం రికార్డు వర్క్‌కు కూడా ఉపయోగపడుతుంది.

యూనిట్ - III

6, 7 అధ్యాయాల్లో మొక్కల్లో వివిధ రకాల ప్రత్యుత్పత్తి విధానాలు, పుష్పించే మొక్కల్లో లైంగిక ప్రత్యుత్పత్తికి సంబంధించిన పరాగ సంపర్కం, ఫలదీకరణం, పిండకోశ నిర్మాణం లాంటి అంశాలు ఉంటాయి. ఈ విభాగంలో 4, 8 మార్కుల ప్రశ్నలు ప్రధానమైనవి.

★ అలైంగిక, లైంగిక ప్రత్యుత్పత్తుల మధ్య తేడాలు, ఫలదీకరణం తర్వాత మార్పులు, అండంలోకి పరాగనాళం ప్రవేశించే పద్ధతులు, బ్యాగింగ్, విపుంసీకరణ, త్రిసంయోగం లాంటి అంశాలపై 4 మార్కుల ప్రశ్నలు, పుష్పంలోని ఫలదీకరణానంతర మార్పులు, పిండకోశం పటం వర్ణన, సూక్ష్మసిద్ధ బీజాశయం, ఫలదీకరణ విధానం లాంటి 8 మార్కుల ప్రశ్నలు ముఖ్యమైనవి.

యూనిట్ - IV

అధ్యాయం 8 లో మొక్కల సిస్టమాటిక్స్ - ఆవృత బీజాల వర్గీకరణ గురించి వివరించారు. మొక్క స్వరూపాన్ని సాంకేతిక వర్ణన ద్వారా శాఖీయ, పుష్ప లక్షణాలను అవగాహన చేసుకోవచ్చు. అయిదో అధ్యాయంలోని అన్ని అంశాలు ఈ అధ్యాయంలో ఉపయోగపడతాయి. ఫాబేసి, సొలనేసి, లిలియేసి కుటుంబాలకు చెందిన ముఖ్యమైన మొక్కలు, వాటి శాఖీయ, పుష్ప లక్షణాలు, ఆర్థిక ప్రాముఖ్యత ఇందులోని ముఖ్యమైన అంశాలు. ఈ అధ్యాయంలో ప్రశ్నలు తక్కువ. సులభంగా మార్కులు సంపాదించే వీలుంటుంది. 2, 4 మార్కుల ప్రశ్నలు తప్పనిసరిగా చదివితే పరీక్షలో 6 మార్కులు కచ్చితంగా సాధించవచ్చు.

యూనిట్ - V

కణ నిర్మాణం, విధుల్లోని 9, 10, 11 అధ్యాయాల్లో కణ నిర్మాణం, కణాంగాలు, విధులు, జీవాణువులు, కణచక్రం, సమ విభజన, క్షయకరణ విభజన అంశాలు ఉన్నాయి. 3 అధ్యాయాల్లో కలిపి 2 మార్కుల ప్రశ్నలు 39 ఉంటాయి. వీటన్నింటిని నేర్చుకోగలిగితే ఈ విభాగం నుంచి వచ్చే మూడు 2 మార్కుల ప్రశ్నలకు సులభంగా సమాధానాలు రాయొచ్చు.

★ ఈ విభాగం నుంచి కనీసం 2 నాలుగు మార్కుల ప్రశ్నలు వచ్చే అవకాశం ఉంది. హరిత రేణువు, మైటోకాండ్రియా నిర్మాణం, కేంద్రకం, కణ సిద్ధాంతం, క్రోమోసోమ్ రకాలు, కేంద్రక పూర్వకణం లక్షణాలు, కేంద్రకామ్లం, ప్రోటీన్ నిర్మాణం, అంతర్దశ, క్షయకరణ విభజనలోని ప్రథమ దశ- I లోని అంశాలు 4 మార్కుల ప్రశ్నలుగా ఇస్తారు.

యూనిట్ - VI

మొక్కల అంతర్నిర్మాణం సంవిధానంలోని అధ్యాయం 12 లో కణజాలశాస్త్రం, అంతర్నిర్మాణ శాస్త్రం గురించి తెలుసుకుంటారు. వృక్ష కణజాలాలు, రకాలు, సరళ, సంక్లిష్ట కణజాలాలు, వాటి విధులు, కాండం, వేరు, పత్రం అంతర్నిర్మాణం లాంటి అంశాలు ముఖ్యమైనవి. ఈ విభాగంలో ప్రయోగ పూర్వకంగా ద్విదళబీజ, ఏకదళబీజ వేరు, కాండాలను అడ్డుకోత తీసి సూక్ష్మదర్శిని ద్వారా పరిశీలిస్తారు. వీటి పటాలు గీసి, భాగాలను గుర్తించడం చాలా ముఖ్యం.

★ ఈ విభాగం నుంచి తప్పనిసరిగా ఒక 8 మార్కుల ప్రశ్న రావచ్చు. కాబట్టి సరైన వాల్యూ పాయింట్‌లను నేర్చుకుని, పటాలు గీయడం బాగా సాధన చేయాలి. అదే విధంగా నాలుగు మార్కుల ప్రశ్నలకు సంబంధించి వివిధ రకాల విభాజ్య కణజాలాలు, పరిచర్మం, వాయురంధ్రాలు, పత్రరంధ్రాల మధ్య భేదాలు, బెండు విభాజ్య కణజాలం, వార్షిక వలయాలు లాంటి అంశాలు చదవాలి.

యూనిట్ - VII

అధ్యాయం - 13 లో ఆవరణ శాస్త్రంలోని మౌలిక అంశాలను చేర్చారు. ఆవరణ సంబంధ అనుకూలనాలు, మొక్కల అనుక్రమం, ఆవరణ సంబంధ సేవల గురించి నేర్చుకుంటారు. ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన భౌగోళిక అంశాలు ఇందులో ఉన్నాయి. పరీక్షల పరంగా 2 మార్కులు, 4 మార్కుల ప్రశ్నలు ముఖ్యమైనవి. 4 మార్కుల ప్రశ్నలకు సంబంధించి నీటి మొక్కల రకాలు, ఎడారి మొక్కల రకాలు, నీటి మొక్కల ఆవరణ సంబంధ అనుకూలనాలు, ఎడారి మొక్కల ఆవరణ సంబంధ అనుకూలనాలు, ఆవరణ సంబంధ సేవలు లాంటివి ముఖ్యమైనవి.

★ విద్యార్థులు తగిన విధంగా ప్రణాళికాబద్ధంగా సిలబస్‌ను ముందుగానే విభజించుకుని థియరీ పరీక్షలకు, అదే విధంగా రెండో సంవత్సరంలో జరిగే ప్రయోగ పరీక్షలకు ఇప్పటినుంచే తయారు కావాలి. ముందు జరిగిన పరీక్ష పత్రాలను పరిశీలించి వెయిటేజీని దృష్టిలో ఉంచుకుని, ప్రయత్నించినట్లయితే ప్రతి ఒక్కరూ కచ్చితంగా 60/60 మార్కులు సాధించవచ్చు.

ఇవి గుర్తుంచుకోండి..

★ ప్రతి పాఠ్యాంశాన్ని పూర్తిగా అవగాహన చేసుకుని చదవాలి.

★ కీ పాయింట్‌లను తయారు చేసుకోవాలి.

★ రెండు మార్కుల ప్రశ్నలకు వీలైనంత క్లుప్తంగా, కచ్చితమైన సమాధానాలు తయారు చేసుకోవాలి.

★ రెండు మార్కుల ప్రశ్నలకు ఛాయిస్ ఉండదు కాబట్టి పూర్తి మార్కులు సాధించాలంటే అన్ని ప్రశ్నలు చదవాలి.

★ నాలుగు మార్కుల ప్రశ్నలకు (స్వల్ప సమాధాన తరహా) వాల్యూ పాయింట్‌లు కనీసం ఎనిమిది రాసుకుని, నేర్చుకోవాలి. అవసరమైన ప్రశ్నలకు పటాలు గీసి, భాగాలు గుర్తించాలి.

★ ఎనిమిది మార్కుల ప్రశ్నలకు (దీర్ఘసమాధాన ప్రశ్నలు) జవాబు రాసేటప్పుడు పూర్తిగా వివరణలు, నిర్వచనాలు, ఉదాహరణలు, విధానాలు రాయాల్సి ఉంటుంది. పటాలు గీసి, భాగాలు గుర్తించడానికి కనీసం 3 మార్కులు కేటాయించారని గుర్తుంచుకోండి.



రచయిత
డాక్టర్ పి. ఉమాఅమరేశ్వరి
సీనియర్ లెక్చరర్

మాదిరి ప్రశ్నపత్రం

సమయం: 3 గంటలు | మార్కులు: 60

విభాగం - I

★ అతి స్వల్ప సమాధాన తరహా ప్రశ్నలు.
★ అన్ని ప్రశ్నలు వరుస క్రమంలో ఒకేచోట రాయాలి.
★ ప్రతి ప్రశ్నకు రెండు మార్కులు.

$2 \times 10 = 20$ M

1. 'బాటనీ' అనే పదం ఏ విధంగా వాడుకలోకి వచ్చిందో వివరించండి.
2. గోధుమ వర్ణ, ఎరుపు వర్ణ శైవలాల్లో ఆ రంగులకు కారణమైన పదార్థాల పేర్లు తెలపండి.
3. వర్గీకరణలో మౌలిక ప్రమాణం ఏది? దాన్ని నిర్వచించండి.
4. మధ్యాభిసార, నిశ్చిత పుష్ప విన్యాసాల మధ్య ఉన్న భేదాన్ని తెలపండి.
5. మకుటదళోపరిస్థితం అంటే ఏమిటి? ఒక ఉదాహరణ ఇవ్వండి.
6. ఒమేగా వర్గీకరణ శాస్త్రం అంటే ఏమిటి?
7. మోటాసెంట్రిక్ క్రోమోసోమ్ లక్షణం ఏమిటి?
8. ప్రాథమిక, ద్వితీయ జీవక్రియోత్పన్నాలు అంటే ఏమిటి? ఉదాహరణలు ఇవ్వండి.
9. ఒక కణజాలంలో 1024 కణాలు ఉంటే ప్రథమ జనక కణం ఎన్నిసార్లు సమవిభజన చెంది ఉంటుంది?
10. జనాభా, సముదాయాలను నిర్వచించండి.

విభాగం-II

★ స్వల్ప సమాధాన తరహా ప్రశ్నలు.
★ ఏవైనా ఆరు ప్రశ్నలకు సమాధానాలు రాయండి.

$6 \times 4 = 24$ M

11. మన దైనందిన జీవితంలో శిలీంధ్రాల పాత్ర గురించి రాయండి.
12. వృక్ష శరీరధర్మశాస్త్రాన్ని ఉదాహరణగా తీసుకుని వృక్ష శాస్త్ర పరిధిని వివరించండి.
13. అలైంగిక, లైంగిక ప్రత్యుత్పత్తుల మధ్య తేడాలను గుర్తించండి. శాఖీయ ప్రత్యుత్పత్తిని కూడా ఒక రకమైన అలైంగిక ప్రత్యుత్పత్తి రకంగా ఎందుకు పరిగణిస్తారు?
14. ఫాబేసికి చెందిన మొక్కల ఆర్థిక ప్రాముఖ్యతను తెలపండి.
15. కణ శక్త్యాగారాల నిర్మాణం, విధులను వివరించండి.
16. క్షయకరణ విభజనలోని ముఖ్యాంశాలను తెలపండి.
17. వాయు రంధ్రాలు, పత్ర రంధ్రాల మధ్య ఉండే భేదాలు ఏమిటి?
18. ఆవరణ-సంబంధ విధులను కొనసాగించడం కోసం తీసుకోవాల్సిన చర్యలను గురించి రాయండి.

విభాగం -III

★ దీర్ఘ సమాధాన తరహా ప్రశ్నలు.
★ ఏవైనా రెండు ప్రశ్నలకు సమాధానాలు రాయండి.

$8 \times 2 = 16$ M

19. వేరు రూపాంతరాన్ని నిర్వచించండి. వివిధ విధులను నిర్వర్తించడానికి వేరు ఏ విధంగా రూపాంతరం చెందిందో వివరించండి.
20. ఆవృత బీజ మొక్కల్లో జరిగే ఫలదీకరణ విధానాన్ని వివరించండి.
21. ద్విదళ బీజ కాండం అడ్డుకోతను వివరించండి.

Kantipudi Kameswara Rao

Q: Respected sir, how many kinds of subscriptions are there in English letter writing?

A: i) Yours faithfully, when you write to higher authorities or superiors.

ii) Yours sincerely, when you write to your friends, people who you don't know and you are writing for the first time.

iii) Yours obediently, when you write to your teachers, head master, principal, etc.,

iv) Yours truly, when you are writing to strangers,

v) Yours affectionately/ yours lovingly when you are writing to the members of your family, and

vi) Yours ever, when you are writing to your wife/ the girl you love. Nowadays, however, in email correspondence, no subscriptions are used.

Ch. Satyanarayana

Q: Respected sir, could you please tell us the difference in use of the following words. Contain, Comprise, Consist.

A: Contain = have something within something else.

Eg: The purse contains her money = the purse has her money in it.

★ Comprise = consist of (to be made of or formed of something).

Eg: The book comprises twenty chapters = It consists of twenty chapters = the number of chapters included in the book are twenty.

N. Bhaktavatsalam, Nellore

Q: నిన్న సాయంత్రం రోడ్డు మీద నడుస్తుంటే, రాయి తగిలి, బోర్లా పడ్డాను - ఈ వాక్యాన్ని ఇంగ్లిష్‌లోకి అనువదించగలరు.

A: As I was walking down the road, I slipped over a stone, and fell face downwards.

ప్రతిభ SPOKEN ENGLISH 955

మీ ప్రశ్నలు పంపాల్సిన చిరునామా...

స్పోకెన్ ఇంగ్లిష్, ప్రతిభ విభాగం,
ఈనాడు కార్యాలయం, రామోజీ ఫిల్మ్ సిటీ,
అనాజ్‌పూర్, రంగారెడ్డి జిల్లా.

Email your questions to: pratibhadesk@eenadu.net

Award, Reward మధ్య తేడా..?



K. Saraswathi

Q: Sir, let me know the meanings of the following with examples.

1) Probe 2) Stake 3) Stand off
4) Crack down 5) Sworn in
6) Swearing in
7) Inauguration, commencement
8) Nipped in the buds.

A: 1) Probe = search / examine something carefully.

Eg: The CBI is probing into the corruption charges against the official.

2) Stake: Three meanings; a) A share in business. **Eg:** He holds a 30% stake in the business.

b) Costs / risks involved.

Eg: Competition has raised the stakes in Global business.

c) Bet. **Eg:** Dharmaraja staked Drowpadi in the game of dice. (he offered her as a bet).

3) Stand off: a) A competition in which neither side wins.

Eg: There was a stand off between the two teams (the game was a draw).

b) A situation in which somebody threatens an official and prevents them from acting.

4) Crack down: To take strong action to stop something bad from happening.

Eg: The tax officials and police cracked down on people with black money.

5) Sworn in: Someone elected promising to people they would discharge their duties to the best of their best to serve people. **Eg:** The high court judge sworn in the governor.

6) Swearing in = Promising to people that they would discharge their duties. (swear = promise)

7) Inauguration = A formal beginning / formal induction of somebody into office.

Commencement = Beginning. **Eg:** The commencement of the match took place at 9 AM. However, beginning is simpler than commencement.

8) Nip something in the bud (not, nipped in the buds) = stop something at an early stage, without allowing it to become a big problem. **Eg:** They should have nipped in the bud the agitation for a separate state.

Mahesh, Uravakonda

Q: సర్, కింది వాక్యాల మధ్య తేడాను తెలుగులో వివరించగలరు.

1) He was punished
2) He was to be punished.
3) He is liable to be punished.

A: 1) అతడిని శిక్షించారు.
2) అతడికి శిక్ష పడాల్సి ఉండింది.
3) అతడికి శిక్ష తప్పకుండా పడుతుంది.

Q: Sir, please translate the following into Telugu.

1) A man who wanted to be a patriot.
2) You have to develop proper instructions to be given to it.
3) They are to be get the same place.
4) Two chlorine atoms has to be an s-p bond.
5) To be or not to be is the problem.
6) Do you like to be let alone?



7) Cause to be done.
8) Right to be elected and hold office.
9) If the United Nations is to be a universal organisation in the true sense.
10) Who are accepted to be a legal personality.
11) The proposition seems to be unfeasible.

A: 1) దేశభక్తుడు కావాలనుకున్నతను.



Writer

- M. Suresan

2) నువ్వు తగిన సూచనలు పెంపొందించుకోవాలి, దానికి ఇవ్వడానికి - ఈ వాక్యానికి అర్థం లేదు.
3) వాళ్లకు అదే స్థానం రావాలి.
4) రెండు క్లోరిన్ అణువులు s - p బంధంలో ఉండాలి.
5) ఉండటమా, పోవడమా (చనిపోవడమా) అనేదే సమస్య.
6) నిన్ను ఒంటరిగా వదిలేయడం నీకు ఇష్టమా?
7) చేయించడం
8) ఎన్నికవడానికి, ఒక పదవిని స్వీకరించేందుకు హక్కు.
9) ఐక్య రాజ్య సంస్థ నిజంగా విశ్వ సంస్థగా ఉండాలంటే.
10) ఎవరినైతే చట్ట సమ్మతమైన వ్యక్తిగా అంగీకరిస్తారో.
11) ఈ ప్రతిపాదన ఆమోదయోగ్యం కానిదిగా కనిపిస్తుంది.

Rafi

Q: Sir, I am a teacher in school. i) Could you please tell me the difference between the spoken English, functional English and also the difference between ii) ..... he went off, ... away, and just .... he went.

A: i) Spoken English means, English as it is spoken. It is colloquial. Communicative English is English used for communication, both spoken and written. Functional English means English used for certain functions, like wishing people when you first meet them, opening conversation with familiar and unfamiliar people, asking for the way to a certain place, requesting people to help you etc.

ii) He went off = He went away. 'He went' is not proper English unless it is followed by the place which he went to.

J. Satyanarayana

Q: Respected sir, please tell me the meaning of below mentioned sentence in Telugu.

'no one is indispensable'

A: ఎవరూ అంత అత్యవసరం కాదు./ ఎవరు లేక పోయినా పని జరిగిపోతుంది.

B. Devendra

Q: Sir what is the difference between Award and Reward ?

A: Award = Something given to a person in recognition of their services. Padmasree, Padmabhushan, etc., are awards. Rewards are things given to people for their particular achievements.

Vasa Mahesh, Visakhapatnam

Q: Good morning sir, can I use the "Idioms and phrases" in essay writing topics like IELTS or TOEFL exams?

A: Why not? While writing essays in exams like IELTS and TOEFL, you get even more marks for your idiomatic English than for your plain English. Go ahead, and learn as many idioms and phrases as you can and use them in TOEFL and IELTS.

Prince Revanth

Q: Sir, could you please tell me the meanings of following:

1) Subjection 2) Arbitrary

A: 1) 'Subjection' is the ruling of one country by a single person, or by another country. Eg: India was under the subjection of the British Rule till 1947. India was under the subjection of the Moghul rule till the 17th century.

2) Depending on a person's will or choice without any reason or logic. A king rules his country arbitrarily (that is, without any reason, logic, system, etc.) ఇష్టం వచ్చినట్లు.

Divvela Surya Teja

Q: Sir, please translate the following word into English. నీకెందుకు?

A: How are you concerned? / Is that any of your business? / What have you got to do with it?

'స్పోకెన్ ఇంగ్లిష్' పాత సంచికల కోసం చూడండి..
www.eenadupratibha.net

Y. Alekhya



Q: Sir, let me know the difference between 'when', while'. And in which contexts we can use the word towards?

A: When and while are almost the same. However, when is mostly used with simple tenses, while is used with continuous tenses.

Examples: 1) When he returned home, he found his dog missing.

2) While her sister was singing, she was dancing.

Sharanya. K

Q: Sir, please translate the following sentence. "It looks nice, isn't it?"

What is the meaning of isn't it? when we use this? Please explain.

A: 'It looks nice, isn't it'? - here the question tag is wrong. The correct question tag is, 'It looks nice, doesn't it?' Question tags like 'isn't it', 'doesn't it' etc., in Telugu mean, ఔనా, కాదా, కదా, లేదా.

ఏయూ ప్రత్యేక డ్రైవ్ పరీక్షలు వాయిదా

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఈనెల 28 నుంచి నిర్వహించదలచిన ప్రత్యేక డ్రైవ్ పీజీ, సెప్టెంబరు 6 నుంచి నిర్వహించాల్సిన డిగ్రీ ప్రత్యేక డ్రైవ్ పరీక్షలను వాయిదా వేసినట్లు ఏయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఎన్.హనుమంతురావు తెలిపారు. తాత్కాలికంగా వీటిని వాయిదా వేశామని తిరిగి ఎప్పుడు నిర్వహించేది ప్రకటిస్తామన్నారు. ఏయూ వెబ్‌సైట్‌లో పరీక్షల తేదీలను చూసుకోవచ్చునని తెలిపారు.

అత్యాచార యత్నం కేసులో నిందితుడికి మూడేళ్ల ఖైదు

తగరపువలస, న్యూస్‌టుడే: బాలికపై అత్యాచారయత్నం, యాసిడ్ దాడికి పాల్పడిన ఘటనల్లో నిందితుడికి చినగదిలి జువైనల్ జస్టిస్ బోర్డు న్యాయమూర్తి షేక్ సబీనా బేగం మూడేళ్ల శిక్షను విధించినట్లు భీమిలి సీఐ బాలసూర్యారావు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటకు చెందిన పొన్నాడ గణపతి (21) 2013లో దాకమర్రి ప్రాంతంలోని ఓ పాలిటెక్నిక్ కళాశాలలో చేరాడు. అదే ఏడాది తమ ఇంటికి సమీపంలో ఉంటున్న 14 సంవత్సరాల బాలికను కళాశాల ప్రాంతానికి అర్ధరాత్రి వేళలో తీసుకొచ్చాడు. ముద్దాడపేట మామిడితోటల్లోకి తీసుకెళ్లి తన కోర్కెను తీర్చాలని బలవంతం చేస్తూ అత్యాచారయత్నానికి ప్రయత్నించాడు. బాలిక ఎదురు తిరగడంతో తన బ్యాగ్‌లో ఉన్న యాసిడ్‌ని ఆమెపై పోశాడు. ప్రాణాపాయం నుంచి బయటపడ్డ బాలిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఘటన జరిగినపుడు నిందితుడి వయసు 17 ఏళ్లు. బాధితురాలి తరపున ఏపీపీ సుధారాణి వాదించారు. నేరం రుజువుకావడంతో న్యాయమూర్తి బేగం తుదితీర్పు వెలువరిస్తూ నిందితుడికి మూడేళ్ల శిక్ష విధించారు.

ఎల్ఎల్ఎం ఫలితాలు విడుదల

ఏఎన్‌యూ, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని దూరవిద్య కేంద్రం మే నెలలో నిర్వహించిన ఎల్ఎల్ఎం ఫలితాలు విడుదలయ్యాయి. మార్కులు జాబితా, ఇతర వివరాలను దూరవిద్య కేంద్రం అంతర్జాలంలో ఉంచినట్లు ఉపరిజిస్ట్రార్ భవనం ఆంజనేయరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పునర్ మూల్యాంకన కోసం ఒక్కో పేపరుకు రూ.960లను సెప్టెంబరు ఏడో తేదిలోపు చెల్లించాలని సూచించారు.

ఈటీవీలో ఈనాడు

ఉదయం

05-45 ఆరాధన, 06-30: అన్నదాత, 07-00: ఈటీవీ న్యూస్, 07-30: శుభమస్తు: ఈ వారం గ్రహఫలం... వీధిపోటు దోషం తొలగడానికి గణేశ శ్రీవాస్తు రీత్యా ఏం చేయాలి? 08-30: టాలీవుడ్ టైమ్, 09-00: పాడుతా తీయగా (రిపీట్), 10-30: జబర్దస్త్ (కామెడీ షో) (రిపీట్), 11-30: జబర్దస్త్ జల్సా టైం (రిపీట్).

మధ్యాహ్నం

12-00: ఆలీతో సరదాగా: క్రియేటివ్ డైరెక్టర్ కృష్ణవంశీతో... (రిపీట్), 01-00: ఢీ-10 (డాన్స్ షో) (రిపీట్), 02-15: టెలివిజన్ తెరపై తొలిసారిగా... అమీతుమీ... (అడవి శేషు, ఈష).

సాయంత్రం

05-00: పుష్పక విమానం: (ప్రఖ్యాత దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు సినీ ప్రయాణం...), 05-30: ఎక్స్‌ట్రా జబర్దస్త్ (రిపీట్), 6-30: ఎక్స్‌ట్రా జబర్దస్త్ జల్సా టైం (రిపీట్)07-00: స్వరాభిషేకం: సుమధుర కవులకు రమణీయ రాగాంజలి...

రాత్రి

09-00: ఈటీవీ న్యూస్, 9-30: పాడుతా తీయగా: (చిరుగాళాల స్వర సమరం), 10-30: స్పెషల్ ఫిల్మ్‌బేస్డ్ ప్రోగ్రాం: 'రాజుగారి హీరోయిన్' – కథానాయికలు కాజల్, కేథరిన్ చెప్పిన సరదా కబుర్లు..., 11-00: స్పెషల్ మూవీ: నీతో (సూర్యప్రకాష్, మెహక్).

ఈటీవీ ప్లస్

మధ్యాహ్నం

11:00 పోవే..పోరా రిపీట్
12:00 ఎక్స్‌ప్రెస్ రాజా బ్యాండ్ బాజా
01:00 ఎక్స్‌ట్రా జబర్దస్త్ రిమిక్స్ రిపీట్
02:00 పటాస్ పంచెస్ రిపీట్
03:00 ఈ-జంక్షన్ రిపీట్

సాయంత్రం

04:00 పటాస్ రిపీట్
05:00 సండే కామెడీ మూవీ.. 'శుభాకాంక్షలు'

రాత్రి

07:30 పటాస్ పంచెస్ రిపీట్
08:30 ఎక్స్‌ట్రా జబర్దస్త్ రిమిక్స్
09:30 నా షో నా ఇష్టం రిపీట్
10:30 సినిమా చూపిస్త మావ రిపీట్
11:30 పటాస్ రిపీట్

ఈటీవీ లైఫ్

- ★ యోగమంత్ర (ఉ.6:00)
- ★ గెట్‌సెట్‌ఫిట్ (ఉ.06:30, 07:00, 07:30, సా 05:00, 05:30,06:00)
- ★ అమృతం - (ఉ.8:00, 12:30, రా.8:00, 10:00)
- ★ హెల్దీ & టేస్టీ (ఉ.8:30, మ.1:00, రా.08:30, 10:30)
- ★ ఆరోగ్యమస్తు (ఉ.9:00, 10:30, సా.4:00, రా.7:00)
- ★ డా.ఈటీవి - (ఉ.9:30, 11:00, మ. 3:30, సా.6:30)
- ★ మానస (ఉ.10:00, మ.12:00, 1:30, రా. 7:30)
- ★ హోమియో (మ.2:00)
- ★ ఆయుష్ (మ.2:30)
- ★ అందరికి ఆరోగ్యం (మ.3:00)
- ★ బాడీ మైండ్ & సోల్ – అంతరంగం (రా.9:00, 11:00)
- ★ బాడీ మైండ్ & సోల్ – సుఖజీవనం (రా.9:30,11:30)

ఈటీవీ సినిమా

ఉదయం: 6-00: మధురిమలు 7-00: సన్‌రైజ్ సినిమా: కాలాంతకులు (శోభన్‌బాబు, జయసుధ), 10-00: మార్నింగ్ షో: ఇరుగు – పొరుగు (ఎన్టీఆర్, కృష్ణకుమారి), మధ్యాహ్నం: 1-00: మాట్నీ: నువ్విలా (హవీష్, యామీగౌతమ్), సాయంత్రం: 4-00: ఈవినింగ్‌షో: హేమాహేమీలు (కృష్ణ, ఏఎన్నార్), రాత్రి: 7-00: ఫస్ట్‌షో: ప్రజానాయకుడు (కృష్ణ, కాంచన), 10-00: అపురూపచిత్రాలు: నటరత్న ఎన్టీఆర్, జమున నటించిన మహత్తర జానపద కథా చిత్రం 'ఏకవీర' విశేషాలు....

ఈటీవీ అభిరుచి

ఉ.6.00: బ్రేక్ ఫాస్ట్ షో - స్పినాచ్ బేసిల్ క్రీప్స్ & సొరకాయ తెలగపిండి రైస్, ఉ.8.30: వావ్ ఏమి రుచి (జపాన్ స్పెషల్స్) – ప్రాన్స్ తెంపుర & యెకిసొబ్బ చికెన్ నూడుల్స్, ఉ.9.30: గోరుముద్దలు – టమాటో కోకోనట్ సూప్, ఉ.11.00: బాబాయ్ హోటల్ – వాక్కాయ పప్పు & వాక్కాయ రోటి పచ్చడి, ఉ.11.30: సూపర్ చెఫ్ - దొండకాయ చట్నీ & అవకాడొ చపాతీ రోల్, మ.12.00, రా.8:30: సూపర్ భీమ్ - గేమ్‌షో, మ.1.00: అతిథి - ఇంటింటి నేస్తం, మ.1.30, రా.10.30: ఆహారవీధిలో - ప్రముఖ రెస్టారెంట్‌లో, మ.2.00: చోటా చెఫ్ - చికెన్ విత్ ఎగ్ ఫ్రై, మ.2.15: పిండివంటలు, ప్రసాదాలు - శెనగపిండి తీపి ఉండ్రాళ్ళు & వడమల వడలు, మ.2.45: పదండి విందుకు – ప్రముఖ రెస్టారెంట్‌లో, మ.3.15, రా.7.30: డిజైనర్ డిష్ – సఫేద్ చికెన్, మ.3.30: మా ఊరి రుచులు – బీరకాయ హల్వా & ఉలవచారు బిర్యాని, సా.5.00: స్నాక్స్ – బ్రెడ్ దహీ వడ, రా.7.00: మమ్మీస్ కిచెన్ – జొన్న దోస, రా.7.15: సెలబ్రేషన్స్ (కేక్ స్పెషల్స్) – మెక్సికన్ హాట్ చాక్లెట్ కేక్, రా.8.00: బ్రేక్ ఫాస్ట్ షో – అవకాడొ క్రీప్స్ & తెలగపిండి మిక్స్‌డ్ వెజిటబుల్ ఊతప్పం.

ఈటీవీ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 ప్రార్థనా సమయం, 07-30 అంతర్యామి, 08-30 యువ, 09-30 ప్రత్యేక వాణిజ్య కార్యక్రమం, 10-00 ఘంటారావం, 10-30 లక్ష్యం, 11-00 ఘంటారావం, 11-30 తెలుగు వెలుగు, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30: నారీ భేరి: అమ్మాయిలకే అందలం, 01-00 ఈటీవీ 360 ^{0}, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30 సుఖీభవ: వంటనూనె... ఏది మంచిది? **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30: తీర్థయాత్ర: ప్రసన్న గణపతి సిదూ దేవాలయం, ఓమాహా, అమెరికా, 05-00 ఘంటారావం, 05-30 ఔరా!, 06-00 ఘంటారావం, 06-30 శ్రీనిలయం, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి, 08-30 ఈటీవీ 360^0, 09-00: మార్గదర్శి: విరాట్ కోహ్లి, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం,11-30 ఇదీ సంగతి (రిపీట్).

ఈటీవీ తెలంగాణ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 యువ (రిపీట్), 07-30 అంతర్యామి, 08-30 యువ, 09-30 ప్రత్యేక వాణిజ్య కార్యక్రమం, 10-00 ఘంటారావం, 10-30 లక్ష్యం, 11-00 ఘంటారావం, 11-30 తెలుగు వెలుగు, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30: నారీ భేరి: అమ్మాయిలకే అందలం, 01-00 ఈటీవీ 360^0, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30: తీర్థయాత్ర: శ్రీ మహాగణపతి ఆలయం, సిరిసి, ఉత్తర కన్నడ జిల్లా, కర్ణాటక, **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 సుఖీభవ: వంటనూనె... ఏది మంచిది? 05-00 ఘంటారావం, 05-30 ఔరా!, 06-00 ఘంటారావం, 06-30 శ్రీనిలయం, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి, 08-30 ఈటీవీ 360^0, 09-00: మార్గదర్శి: విరాట్ కోహ్లి, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి.

ఏ ఛానల్లో ఏముంది.. 27-08-2017

ఎస్వీబీసీ: **ఉదయం:** 05-30 సుప్రభాత వైభవం, 06-30 శుభోదయం + నిత్య పూజలివిగో, 07-00 విష్ణుసహస్ర నామ స్తోత్రం, 07-30 శ్రీవారి సేవలు సమాహారం, 08-00 శతమానం భవతి, 08-30 పూజకు వేళాయె - సూర్యభగవాన్, 09-00 ఆధ్యాత్మిక విశేషాలు, 09-30 భక్తిగీతమాలిక, 10-00 ఆధ్యాత్మిక విశేషగలు - కన్నడ, 10-30 భగవద్గీత - బాలవికాసం, 11-00 వెంకటేశ్వర వైభవం, 11-30 ప్రత్యేక వార్తలు - ఆముక్తమాల్యద, **మధ్యాహ్నం:** 12-00 లైవ్ కల్యాణోత్సవం, 01-00 ఆధ్యాత్మిక విశేషాలు, 01-30 విష్ణు సహస్ర నామామృతం + లైవ్ డోలోత్సవం, 02-00 సినిమా, **సాయంత్రం:** 04-30 వివిధ రూపాలలో గణపతి, 05-00 లైవ్ ఎస్.డి. సేవ - తిరుమల + ప్రత్యేక వార్తలు + లక్ష్మీగద్యం, 06-00 లైవ్ నాదనీరాజనం - తిరుమల, **రాత్రి:** 07-30 లైవ్ ఘంటానాదం + శ్రీనివాసగద్యం + భవయామి రఘురామం, 08-00 అన్నమయ్య పాటకు పట్టాభిషేకం, 09-30 గణాధిపతి - నృత్యరూపకం, 10-00 ఆధ్యాత్మిక విశేషాలు, 10-30 మహాభారతం - అనుశాసనిక పర్వం.

భక్తి టీవీ: **ఉదయం:** 06-00 శ్రీగణేశసహస్రం, 06-30 శ్రీలక్ష్మీ సహస్రం, 07-00 అర్చన, 07-30 మంత్రపుష్పం, 08-00 గణపతి దర్శనం, 08-30 వారఫలం, 09-30 జై..జై.. గణేశా (లైవ్), 11-00 ధర్మసందేహాలు, 11-30 వేదం..జీవననాదం, **సాయంత్రం:** 04-30 గణపతి దర్శనం, 05-30 శ్రీగణేశ సహస్రం, 06-00 శ్రీలక్ష్మీసహస్రం, **రాత్రి:** 07-00 భక్తివిశేషాలు, 07-30 జై..జై.. గణేశా (లైవ్), 08-00 వారఫలం, 09-00 ధర్మక్షేత్రం, 10-00 ధర్మ సందేహాలు, 10-30 భక్తివిశేషాలు.

జీ తెలుగు: **ఉదయం:** 06-30 టెలీ షాపింగ్, 07-30 శ్రీకరం శుభకరం, 08-00 డా.సుభాష్ చంద్ర షో, 09-00 సినిమా: అఆ, మధ్యాహ్నం: 12-00 ఈవెంట్ – అప్సరా అవార్డ్స్ రిపీట్, 03-00 సినిమా: శ్రీమంతుడు, సాయంత్రం: 06-00 సినిమా: డోర, 09-00 కొంచెం టచ్‌లో ఉంటే చెప్తా, 10-00 బిగ్ సెలబ్రిటీ ఛాలెంజ్-ఇంటర్నేషనల్- 2017 రిపీట్, 11-00 పోలీస్ డైరీ.

స్టార్ మా: **ఉదయం:** 07-00 ఫిల్మ్‌బేస్డ్, 07-30 ఫన్ టైమ్, 08-00 రాశి ఫలాలు, 09-00 సినిమా: అదుర్స్, **మధ్యాహ్నం:** 12-00 సినిమా: సన్/o సత్యమూర్తి, 03-00 సినిమా: సినిమా చూపిస్తా మావ, **సాయంత్రం:** 06-00 సినిమా: సింగమ్3, 09-00 బిగ్ బాస్, 10-30 బిగ్ బాస్ (రిపీట్).

జెమిని: **ఉదయం:** 06-00 శ్రీ కరుణామయి దేవి వైభవం, 06-30 టెలీ షాపింగ్, 07-00 సకలసిద్ధి, 07-30 సినిమా: వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్, 10-00 సైమా కర్టన్ రైజర్, 11-00 సినిమా:నువ్వొస్తానంటే నేనొద్దంటానా, **మధ్యాహ్నం:** 02-25 సినిమా : శ్రీరస్తు శుభమస్తు, **సాయంత్రం:** 05-35 సినిమా: గోవిందుడు అందరివాడేలే, **రాత్రి:** 08-30 నం.1 యారి విత్ రానా, 10-30 సినిమా: రెబల్.

హెచ్‌బీఓ: **ఉదయం:** 06-00 ప్యాసింజర్ 57, 07-34 పాన్, 09-21 కుంగ్ ఫూ పాండా 2, 10-57 జాక్ రీచర్ : నెవర్ గో బ్యాక్, మధ్యాహ్నం:01-00 ది కంజ్యూరింగ్ 2, 03-00 ట్రిపుల్ ఎక్స్, సాయంత్రం: 05-08 సూసైడ్ స్క్వాడ్, రాత్రి: 07-15 ది లెజెండ్ ఆఫ్ టార్జాన్, 09-00 ది కంజ్యూరింగ్ 2, 11-00 10,000 బీసీ

స్టార్ మూవీస్: **ఉదయం:** 06-01 టర్మినేటర్ సాల్వేషన్, 08-20 క్లౌడీ విత్ ఏ ఛాన్స్ ఆఫ్ మీట్‌బాల్స్ 2, 10-18 పెంగ్విన్స్ ఆఫ్ మడగాస్కర్, మధ్యాహ్నం: 12-06 ది అమేజింగ్ స్పైడర్ మ్యాన్ 2, 02-57 ఫెంటాస్టిక్ ఫోర్: రైజ్ ఆఫ్ ది సిల్వర్ సర్ఫర్, సాయంత్రం:04-50 టామ్ యమ్ గూంగ్ 2, రాత్రి:07-02 అనకొండ 3 : ఆఫ్‌స్ప్రింగ్, 09-00 టైటానిక్,

డబ్ల్యూబీ: **ఉదయం:** 06-00 స్టార్ డస్ట్, 08-14 ఇంప్రాక్టికల్ జోకర్స్, 09-19 లెగో డీసీ కామిక్స్ సూపర్ హీరోస్: జస్టిస్ లీగ్ కాస్మిక్ క్లాష్, 10-59 కిల్లర్స్, మధ్యాహ్నం: 12-43 ది 33, 02-50 డేస్ ఆఫ్ థండర్, సాయంత్రం: 04-40 ప్రీస్ట్, 06-08 ది డార్క్‌నైట్ రైజెస్, రాత్రి: 09-00 ది యానిమల్, 10-23 ది హాబిట్: యాన్ అన్‌ఎక్స్‌పెక్టెడ్ జర్నీ.

జీ సినిమా: **ఉదయం:** 07-21 జర్నీ బాంబే టు గోవా, 10-35 హ్యాపీ న్యూ ఇయర్, మధ్యాహ్నం: 02-31 వివాహ్, సాయంత్రం: 06-04 ధమాల్, రాత్రి: 09-00 ఫిర్ హేరా ఫేరీ.

రైతేరాజు

పచ్చిరొట్ట పైర్లకు ఉండాల్సిన లక్షణాలు: తక్కువ రోజుల్లో పెరిగి ఎక్కువ పచ్చిరొట్టను ఇచ్చేలా ఉండాలి. అన్ని రకాల నేలల్లో త్వరగా పెరిగి, కలుపు పెరుగుదలను అరికట్టేదిగా ఉండాలి. నేలలో కలియదున్నినప్పుడు త్వరగా కుళ్ళి భూమిలో కలిసేలా ఉండాలి. పప్పుజాతికి చెందిన పచ్చిరొట్టయితే గాలి లోని నత్రజనిని స్థిరీకరించి నేల సారాన్ని పెంచుతుంది.

జైకిసాన్ కార్యక్రమాన్ని www.youtube.com/etv2jaikisan ద్వారా కూడా వీక్షించవచ్చు.

పాడి పశువుల్లో ఈసుడు రోగం-నివారణ



బ్రూసెల్లోసిస్ వ్యాధినే ఈసుడు రోగం లేక అకాల ప్రసవం అని కూడా పిలుస్తారు. ఈ వ్యాధి పశువుల నుండి మనుషులకు కూడా వ్యాప్తి చెందే సాంక్రమిక వ్యాధి. 'బ్రూసెల్లా' అను బాక్టీరియా తక్కువ వాతావరణ ఉష్ణోగ్రత మరియు అపరిశుభ్రమైన పరిస్థితులలో వృద్ధి చెంది ఈ బ్రూసెల్లోసిస్ వ్యాధిని కలిగిస్తుంది. ఈ వ్యాధి పాడి పశువులు, గొర్రెలు, మేకలు పందులలో కూడా సంక్రమించడం ద్వారా పాడి పరిశ్రమ, మాంస పరిశ్రమలు తీవ్రంగా నష్టపోతున్నాయి. మనుషులకు సంబంధించినంత వరకు బ్రూసిల్లోసిస్ వ్యాధి ముఖ్యంగా జంతువులతో వృత్తిపరమైన సంబంధాలు కలిగిన పశువైద్యులు, పశువైద్య సిబ్బంది, జీవాల పెంపకందార్లు, పాడి రైతులు, మాంస పరీక్ష చేసేవారికి, పాలు మరియు మాంస పరిశ్రమలలో పని చేసే కార్మికులకు సంక్రమించే అవకాశం ఉంది. కనుక బ్రూసెల్లోసిస్ వ్యాధి పట్ల తగిన అవగాహన కలిగి నివారణ చర్యలు పాటించాల్సిన అవసరం ఉంది.

వ్యాధి వ్యాప్తి చెందే విధానం: వ్యాధిగ్రస్తమైన పశువుల గర్భకోశం నుండి స్రవించే ద్రవాలు, చీము ద్వారా బాక్టీరియా ఇతర పశువులకు, మనుషులకు వ్యాప్తి చెందుతుంది. బ్యాక్టీరియాతో కలుషితమైన మేత మేయడం, నీరు త్రాగడం వలన, వ్యాధిగ్రస్తమైన మగ పశువు వీర్యాన్ని గర్భధారణకు వినియోగించటం వలన కూడా పశువులు వ్యాధిగ్రస్తమవుతాయి. ఇలా వ్యాధిగ్రస్తమైన పశువుల పాలు, వెన్న, మాంసం ఉత్పత్తుల వినియోగం వలన మనుషులు బ్రూసెల్లోసిస్ వ్యాధి బారిన పడతారు.

వ్యాధి లక్షణాలు: చూడి పశువులు 5-9 నెలల చూడి దశల్లో ఈసుకు పోవడం జరుగుతుంది. మాయ వేయకపోవడం, గర్భాశయ సంభంధమైన వ్యాధులు కలగడం జరుగుతుంది. పశువు ఈసుకు పోయిన తర్వాత 10-13 రోజుల వరకు మానం నుండి దుర్వాసనతో కూడిన మట్టు (చిక్కటి ద్రవం) పడుతుంటుంది. పశువులు తీవ్రమైన దీర్ఘకాలిక జ్వరంతో బాధపడతాయి. కీళ్ళవాపులు, నొప్పులు, మగ పశువుల్లో వృషణాల వాపు, వంధ్యత్వానికి గురి కావడం జరుగుతుంది.

★ మనుషులు బ్రూసెల్లోసిస్ వ్యాధికి గురైనప్పుడు తీవ్రమైన దీర్ఘకాలిక జ్వరంతో పాటు కీళ్ళ వాపులు, నొప్పులతో బాధపడతారు. రాత్రివేళ చెమటలు పట్టడం, దగ్గు, శ్వాస కష్టమవడం గమనించవచ్చు. పురుషులలో వృషణాల వాపు, వంధ్యత్వం సంక్రమించే అవకాశం ఉంది. వ్యాధిగ్రస్త స్త్రీలలో గర్భస్రావం జరుగుతుంది.

నివారణ చర్యలు: 4 నుండి 8 నెలల వయస్సు గల గేదె దూడలన్నింటికీ 'బ్రూసెల్లా' వ్యాధినిరోధక టీకాలు వేయించాలి. పశువుల పాకలను ముఖ్యంగా చూడి పశువుల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. వ్యాధిగ్రస్త పశువును గుర్తించిన వెంటనే మంద నుండి వేరు చేసి పశువైద్యుని సంప్రదించి చికిత్స చేయించాలి. వ్యాధి నయం కాక కోలుకోని పశువులను శాశ్వతంగా మంద నుండి తొలగించాలి. పశువు ఈసుకుని పోయినప్పుడు దాని పిండాన్ని కాల్చివేయాలి. బ్రూసెల్లోసిస్ వ్యాధికి గురి కాకుండా మనుషులకు టీకాలు లేవు. కనుక పశువులలో వ్యాధినివారణ తోనే మనుషులలో వ్యాధిని అరికట్టవచ్చు.

– కె.బాలబ్రహ్మం, పశువైద్యులు, చిట్టేడు, నెల్లూరు జిల్లా.

వరి పంటకు జీవన ఎరువులు

జీవన ఎరువులు అనగా భూమిలో సూక్ష్మజీవుల పెరుగుదలకు ఉపయోగపడే హార్మోన్లను సమకూర్చే సూక్ష్మజీవుల సముదాయం. వీటి వాడకం ద్వారా నేలలో సూక్ష్మజీవుల స్థాయి పెంచుకొని, ఎరువులపై ఖర్చు తగ్గించుకోవచ్చు.

నత్రజనిని స్థిరికరించే జీవన ఎరువు అజోస్పైరిల్లమ్: ఈ మధ్యకాలంలో దీని ప్రాముఖ్యత అధికంగా గుర్తించటం జరిగింది. ఈ బాక్టీరియా మొక్క వేర్ల చుట్టూ పెరుగుతూ అవకాశమున్న చోట మొక్కల వేళ్ల లోనికి చొరబడి జీవించటం వలన స్థిరికరించబడిన నత్రజని మొక్కకు నేరుగా అందుతుంది.

★ 2 కిలోల అజోస్పైరిల్లమ్ కల్చర్‌ను 80-100 కిలోల సేంద్రియ ఎరువుతో కలిపి ఒక ఎకరం పొలంలో విత్తనం క్రింద పడేలా వేసుకోవాలి. నాట్లు వేసే సమయంలో 2 కిలోల అజోస్పైరిల్లమ్ కల్చర్ కలిపిన ద్రావణంలో వరి నారును ముంచి నాటుకోవచ్చు. ఎకరాకు 250 నుండి 500 మి.లీ. ద్రవ రూప జీవన ఎరువును 10 కిలోల పశువుల ఎరువుతో కలిపి దమ్ము సమయంలో పొలంలో వేసుకోవాలి.

– కిల్లి లక్ష్మణ్, ఏరువాక కేంద్రం, విజయనగరం

విఘ్ననాయకా..

విభిన్నరూపాయ..

వినాయకా.. గణేశా.. పార్వతీతనయా.. లంబోదరా.. వక్రతుండా.. మహాకాయా.. గజాననా.. ఇలా ఏ పేరుతో పిలిచినా పలికే గణాధిపతి మన గణపతి. నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఇందుగలడందు లేడన్న సందేహం లేకుండా అన్నిచోట్ల కొలువుదీరి భక్తజనులకు కనులపండువగా దర్శనమిస్తున్నాడు. శ్రీకాకుళం నగరంలోనూ, జిల్లాలోని ఇతర ప్రాంతాల్లోనూ ఏర్పాటు చేసిన మండపాల్లో ప్రతిష్ఠించిన గణేశుడు అందరినీ అలరిస్తున్నాడు. విశ్వవంద్యుడైన వినాయకుని నవరాత్రి మహోత్సవాలు జిల్లాలో అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. విభిన్న రూపాల్లో ప్రతిష్ఠించిన వినాయకుడికి ఆబాలగోపాలం భక్తిప్రపత్తులతో కొలుస్తున్నారు.

–న్యూస్‌టుడే బృందం



కవిటి మండలం కొత్తూరులో తమలపాకుల వినాయకుడు



ఎల్‌ఎన్‌పేట మండలం మోదుగువలసలో భారీ విగ్రహం



శ్రీకాకుళంలోని మొండేటి వీధిలో నగరానికి చెందిన ఆదిరెడ్డి దంపతులు బహూకరించిన వెండి సింహాసనంపై లక్ష్మీగణపతి



విజయగణపతికి స్వర్ణపుష్పార్చన



టెక్కలిలో గడ్డితో తయారుచేసిన గణనాథుడు



రాజాం రాణావీధిలోని 50 అడుగుల భారీ గణేశుడు



శ్రీకాకుళం నగరంలోని జీటీ రోడ్డులో వర్తక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహా గణపతి



కాశీబుగ్గ శ్రీనివాసలాడ్జి కూడలిలో వంటపాత్రలతో..



లావేరులోని చిన్న వీధిలో చేనేత గణపతి



కోటబొమ్మాళి మండలం నిమ్మాడలో పూజల్లో పాల్గొన్న మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు దంపతులు



పలాసలోని మొగిలిపాడులో సింహం ఆకారంలో అలంకరణ



ఎచ్చెర్ల మండలం తోటపాలెంలోని చెరువులో హంస వాహన మండపం



శ్రీకాకుళంలోని విజయగణపతి ఆలయంలో విజయగణపతి దీక్షలు



శ్రీకాకుళంలోని చల్లవీధిలో ఆకట్టుకునే అలంకరణ

హాయ్! బుజ్జీ!!



మలేషియా

మలేషియా...
మనకు తెలిసిన పేరే... మరి తెలియని
ఈ దేశ కబుర్లేంటో తెలుసుకుందామా!

ఆధునిక మానవుడి అడుగుజాడలు ఇక్కడే!

* ఆసియా ఖండంలోని ముఖ్య దేశాల్లో మలేషియా ఒకటి.
* పూర్వం డచ్, బ్రిటిషర్ల పాలనలో ఉన్న ఇది 1957లో పూర్తి స్వాతంత్ర్యం పొందింది.
* ఇక్కడి జాతీయ రహదారుల పొడవు 65,877 కిలోమీటర్లు. అంటే మొత్తం భూమి చుట్టుకొలత కంటే కూడా ఎక్కువ. (భూమి చుట్టుకొలత 40,075 కిలోమీటర్లు మాత్రమే)
* మలేషియా అనగానే జంట టవర్లే గుర్తొస్తాయి. వీటి పేరు 'పెట్రోనాస్ ట్విన్ టవర్లు'. ఒక్కోదాంట్లో 88 అంతస్తులుంటాయి. వీటి ఎత్తు 450 మీటర్లు. అంటే ఈఫిల్ టవర్ కంటే ఎత్తయినవే అన్నమాట. వీటిలో కార్యాలయాలుంటాయి.
* రబ్బరు ఉత్పత్తి చేయడంలో ప్రపంచంలో మూడో అతి పెద్ద దేశమిది. 2011 సంవత్సరంలోనే 9,96,673 మెట్రిక్ టన్నుల రబ్బరును ఉత్పత్తి చేసింది. ప్రపంచంలోనే రబ్బరు చేతి తొడుగులు తయారు చేయడంలో ప్రసిద్ధి చెందిందీ దేశం.
* ప్రపంచంలోనే అతి పెద్ద కార్తికేయుడి (సుబ్రహ్మణ్యేశ్వరస్వామి) విగ్రహం ఉన్నది ఇక్కడి బాటు గుహల్లోని ఆలయం దగ్గరే. దీని ఎత్తు 140 అడుగులు. అంటే ఓ పద్నాలుగు అంతస్తుల భవనమంత.
* అభివృద్ధి చెందిన దేశాలతో పోల్చుకుంటే ఇక్కడ దుస్తులు, ఆహారం, నివాస వసతుల కోసం అయ్యే ఖర్చు తక్కువే.
* వీరి ఆహార అలవాట్లు మనకులాగే ఉంటాయి. మధ్యాహ్న భోజనంలో గుడ్డు, కొబ్బరన్నం, కారంగా ఉండే సంబల్ చిల్లీ పేస్ట్, వేరుసెనగ గింజలు, దోసకాయ ముక్కలు... లాంటివి ఉంటాయి.





విదేశం... విశేషం!

దేశం: మలేషియా
రాజధాని: కౌలాలంపూర్
కరెన్సీ: మలేషియన్ రింగెట్
జనాభా: 3,15,48,000 **విస్తీర్ణం:** 3,30,803 చదరపు కిలోమీటర్లు
అధికారిక భాష: బహాసా మలేషియా **అధికారిక లిపి:** మలయ్
జెండా: జెండాపై ఉన్న ఎరుపు, తెలుపు రంగు గీతలు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల సమాన హోదాకూ, నక్షత్రం వారి ఐకమత్యానికీ నిదర్శనం. పక్కనున్న అర్ధ చంద్రుడు వారి అధికారిక మతం ఇస్లాంకు ప్రతీక.



* ప్రపంచంలోనే పొడవైన(కేవ్ ఛాంబర్) గుహ గది ఉన్నది ఇక్కడి సర్వాక్ ఛాంబర్ గుహల్లోనే.
* ఈ దేశ కరెన్సీ రింగెట్. స్థానికులు మాత్రం డాలర్ అనే పిలుచుకుంటారు. దీని విలువ ఇప్పుడు మన కరెన్సీలో దాదాపు 14 నుంచి 15 రూపాయలుంది.



* మలేషియాలో 40,000 సంవత్సరాలకు ముందు ఆధునిక మానవుడు నివసించినట్టు ఆధారాలు దొరికాయి. క్రీస్తుశకం మొదటి శతాబ్దం నుంచి ఇక్కడికి భారత్, చైనా నుంచి వ్యాపారులు వలసవచ్చారట. రెండో, మూడో శతాబ్దాల్లో వాణిజ్య రేవులు, తీర ప్రాంత నగరాలు నిర్మించుకున్నారు. దీంతో ఈ దేశ ప్రజలపై భారతీయ, చైనా సంస్కృతులు, సంప్రదాయాల ప్రభావం పడటం మొదలైంది.
* వీధి గోడలపై బొమ్మలేసే కళకు ఇక్కడ చాలా ఆదరణ ఉంది. అందుకే ఇక్కడి వీధుల్లో ఎక్కడ చూసినా, ముఖ్యంగా కౌలా లంపూర్‌లో గోడలపై చాలా బొమ్మలు కనిపిస్తుంటాయి.
* మనిషికి దగ్గర పోలికలతో ఉండే తోకలేని కోతులు 'ఒరాంగుటాన్లు' తెలుసుగా. ప్రస్తుతం ఇవి ఈ దేశ సమీపంలోని బోర్నియో, సుమాత్ర దీవుల్లో మాత్రమే ఉన్నాయి.
* ప్రపంచంలోనే విడిపోకుండా ఉన్న అతి పెద్ద ఆకు ఇక్కడి సాభాలో ఉంది. అది అలోకాసియా మక్రోరైజ మొక్కది. 3.2 మీటర్ల పొడవు, 1.92 మీటర్ల వెడల్పు ఉంటుంది.
* ఇక్కడున్న వలసదారుల్లో చైనీయులు, భారతీయులే ఎక్కువ.
* ఇప్పుడు స్వతంత్రంగా ఉన్న సింగపూర్ దేశం గతంలో మలేషియాలోని ఒక రాష్ట్రం.

> మన శక్తి కన్నా
> చాలా సార్లు సహనం
> మంచి ఫలితాల్ని ఇస్తుంది
> – ఎమర్సన్

పదసంపద!

రోజుకు రెండు పదాలు చదివితే పదసంపద మీదే!

- Qualification = యోగ్యత
- నమూనా = మాదిరి

నవ్వుల జల్లులు!

టీచర్: రెండు లీటర్ల పాలకు రెండు లీటర్ల నీళ్లు కలిపితే ఏమవుతుంది?
రవి: పెద్ద గొడవవుతుంది టీచర్!

రాధ: నీ చేతి రాత ఇంత చెత్తగా ఉంది అయినా ఇన్ని మార్కులు ఎలా వచ్చాయి రా?
లడ్డు: అలా రాయబట్టే పరీక్షల్లో నా తప్పులు పట్టుకోలేదక్కా!

- పి.వి.రమణకుమార్, చిలకలూరి పేట

చిలిపి ప్రశ్న

తక్కువ, ఎక్కువకు తేడా ఏంటి?

- జి.డి.ఆర్. పట్నాయక్, ఖమ్మం

అవే పదాలు

ఆధారాలతో తెలుగు పదాలను గడుల్లో రాయండి. అడ్డంగానైనా, నిలువుగానైనా అవే పదాలు వస్తాయి

1. SMOOTH			
2. FOREHEAD			
3. WORM			

- ఎం.వి.కృష్ణసమీరా, బెంగళూరు

ఎందుకు? ఏమిటి? ఎలా?

ప్రశ్న: సముద్రాల్లో ఉండే అగ్ని పర్వతాల చుట్టూ నీరు ఉంది కాబట్టి ఆ పర్వతాలు చల్లారిపోవాలి. కానీ అవి అగ్ని చిమ్ముతూ ఉంటాయెందుకని?

- బి. రాజేశ్వర్, పొన్కల్

సముద్రంలోని అగ్నిపర్వతాలు చల్లారిపోవే?

జవాబు: సముద్రాల అడుగునున్న చాలా అగ్ని పర్వతాలు లావా వెదజల్లకుండా వెంటనే చల్లారి పోతుంటాయి. కానీ తీవ్రమైన ఒత్తిడితో సముద్రపు లోతు భాగాన ఉన్న నేల పొరకన్నా, ఇంకా అట్టడుగు పొరల్లోంచి మాగ్మా చిమ్ముకొస్తుంటుంది. ఇది చాలా ఒత్తిడితో బయటకు రావడం వల్ల సముద్రపు నీటితో చల్లారదు. దీంతో అగ్ని కీలల్లాగ అప్పుడప్పుడు లావాని చిమ్ముతాయి. అయితే ఇలా లావా చిమ్మడం అదే పనిగా, ఒకేలా ఉండదు.

సముద్రపు అడుగు భాగాల్లో అగ్ని పర్వతాలు ఉన్నట్లయితే వాటి నుంచి చిమ్మే లావా అడుగునే చల్లారిపోయినా ఆ లావాలో ఉండే వాయువులు బుగ్గల్లా, బుడగల్లా సముద్రపు మట్టానికి చేరుకుంటాయి. ఆ వాయువుల విషతత్వం, వేడి వల్ల అక్కడ సముద్ర జీవులు బతకలేవు. అందుకే సముద్రపు నీటి ఉపరితలం నుంచి వేడి వాయువులు వస్తున్నా, అక్కడి నీటి రంగు మరోలా ఉన్నా అడుగున అగ్ని పర్వతాలున్నట్లు భావించొచ్చు.



- ప్రొ॥ ఎ. రామచంద్రయ్య, నిట్, వరంగల్; ఎడిటర్, చెకుముకి, జనవిజ్ఞాన వేదిక (తెలంగాణ)

అక్షరాలా బొమ్మ



జవాబులు: **చిలిపి ప్రశ్న:** మొదటి అక్షరం! **అవే పదాలు :** 1. నునుపు 2. నుదురు 3. పురుగు

● దయనీయ స్థితిలో వర్షపాతం నమోదు యంత్రాలు

● సమాచారం ఇచ్చేవారే కరవు ● టెక్కలి, పాలకొండ డివిజన్లలో ఏఎస్ఓల ఖాళీలు

వాన లెక్క.. ఎంత పక్కా?!

న్యూస్‌టుడే- కలెక్టరేట్ (శ్రీకాకుళం)

వర్షపాత కొలమానం అనేది అత్యంత కీలకం. దీనిపై జిల్లా భవిష్యత్తు కూడా ఆధారపడి ఉంటుంది. కరవు జిల్లాగా ప్రభుత్వం ప్రకటించాలంటే వర్షపాతమే ప్రధాన ఆధారం. జిల్లా సగటు వర్షపాతం తెలియాలంటే ఆకాశం నుంచి పడిన నీటిచుక్కను కొలవాలి. ఇందుకు ఉపయోగించే రెవెన్యూ రెయిన్ గేజ్‌లు జిల్లాలో అస్తవ్యస్తంగా ఉండడంతో వర్షపాతం కొలుస్తున్న తీరు సందేహాలకు తావిస్తోంది.

38 మండల తహసీల్దార్ కార్యాలయాలలో...: జిల్లాలోని 38 మండల తహసీల్దార్ కార్యాలయాల్లో 38 రెయిన్ గేజ్‌లు ఉన్నాయి. వీటిని సమతల ప్రదేశంలో ఉంచాలి. చెట్ల కింద ఉంచడానికి వీలులేదు. వర్షపాతాన్ని కొలిచేందుకు ప్రభుత్వం సరఫరా చేసిన కొలమానం (గ్లాసు) వినియోగించాల్సి ఉంది. అర్బన్ ప్రాంతాల్లో మినహా మిగిలిన ప్రాంతాల్లో నేలపైనే ఉంచాలి. జిల్లాలో మాత్రం ఇందుకు భిన్నంగా రెయిన్ గేజ్‌లు దర్శనమిస్తున్నాయి. మండలాల్లో అమర్చిన చేసిన రెయిన్ గేజ్‌లు చూస్తే ఎవరికైనా ఆశ్చర్యం కలగకమానదు.

వేధిస్తున్న సిబ్బంది కొరత: మండలాల్లో వర్షపాతం కొలిచేది సహాయ గణాంకాధికారులే. ప్రతి మండల తహసీల్దార్ కార్యాలయంలో వీరు విధులను నిర్వర్తిస్తుంటారు. జిల్లాలో 38 మండలాలకు గాను పాలకొండ, టెక్కలి రెవెన్యూ డివిజన్లలో సిబ్బంది కొరత వేధిస్తోంది. టెక్కలి డివిజన్‌లో 8, పాలకొండ డివిజన్‌లో 8 మంది ఏఎస్ఓ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. శ్రీకాకుళం డివిజన్‌లో మాత్రమే పూర్తిస్థాయిలో ఏఎస్ఓలు పనిచేస్తున్నారు. ఇన్‌ఛార్జీల కారణంగా పర్యవేక్షణ గాలికొదిలేశారు. ఇన్‌ఛార్జీలు ఆయా మండలాల్లోని రెయిన్ గేజ్‌లను పరిశీలించిన దాఖలాలు లేవనే విమర్శలు ఉన్నాయి.



పలాసలో చెట్ల మధ్య ఇలా...



వజ్రపుకొత్తూరులో..



రణస్థలంలో..



నరసన్నపేటలో..



ఇచ్ఛాపురంలో...

70 ఆటోమెటిక్ వెదర్ స్టేషన్లు: జిల్లాలో ఆటోమెటిక్ వెదర్ స్టేషన్‌లు 70 ఉన్నాయి. ఇవి విద్యుత్తు సబ్‌స్టేషన్‌ల పరిధిలోని అమర్చారు. వీటి నుంచి నేరుగా ఏపీఎస్‌డీపీఎస్ కార్యదర్శి కార్యాలయంలోని సర్వర్‌లో నమోదవుతాయి. అక్కడి నుంచి ఆయా జిల్లాలకు సమాచారం చేరవేస్తారు. ఇవి పని చేయకపోతే ఎన్ఏ (నాట్ ఎవైలబుల్)గా రిపోర్టు అవుతుంది. అక్కడకు 72 గంటల్లోగా సంబంధిత ఇంజినీరు వెళ్లి మరమ్మతులు చేపట్టి అందుబాటులోకి తీసుకురావాలి.

ఎలాంటి అడ్డు లేకుండా చూడాలి

వర్షపాతం కొలిచే రెయిన్‌గేజ్ వద్ద ఏర్పాటు చేసి గ్లాసులో నీరు పడేందుకు వీలుగా ఉండాలి. ఎలాంటి అడ్డు ఉండకుండా చూడాలి. 38 మండలాల్లోని తహసీల్దార్ కార్యాలయాల వద్ద వీటిని ఉంచారు. చెట్టుకొమ్మలు అడ్డు ఉంటే వాటిని తొలగించాలి. మండల స్థాయిలో సహాయ గణాంకాధికారులు వీటిని పర్యవేక్షించాలి. జిల్లాలో పాలకొండ, టెక్కలి డివిజన్లలో ఖాళీలు ఎక్కువగా ఉన్నాయి. వాటిని త్వరలో పొరుగు సేవల (అవుట్ సోర్సింగ్) విధానంలో భర్తీ చేస్తాం.

-ఎం.శివరామ నాయకర్, సీపీవో

ఇళ్లు, దీపాలకు సత్వరంగా జియోట్యాగింగ్

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: జిల్లాలోని పంచాయతీల్లో ఇళ్లు, పంచాయతీ ఆస్తులతో పాటు విద్యుత్తు దీపాలకు సంబంధించిన జియోట్యాగింగ్ పనులు వేగవంతం చేసి సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి బి.కోటేశ్వరరావు ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు, ఈవోపీఆర్డీలతో జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయంలో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో కొత్తగా మంజూరైన పంచాయతీ, అంగన్‌వాడీ భవనాల పనులు సత్వరమే పూర్తి చేయాలని ఆదేశించారు. స్థల సమస్యలను స్థానిక రెవెన్యూ అధికారుల సమన్వయంతో పరిష్కరించాలన్నారు. విద్యుత్తు బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వంట పాత్రలు అందించాలన్నారు. చంద్రన్న బీమా నిమిత్తం అవసరమైన మరణ ధ్రువపత్రాలు రెండు రోజుల్లో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు అందించాలన్నారు. వీధి దీపాల నిర్వహణ, పారిశుద్ధ్య పనులు సక్రమంగా చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో ఐసీడీఎస్ పీడీ లీలావతి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ కె.సత్యనారాయణ, డివిజనల్ పంచాయతీ అధికారులు జె.రమాప్రసాద్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నీటమునిగిన వరి పొలాలు

మాళువ(సారవకోట), న్యూస్‌టుడే: ఎగువ ప్రాంతంలో శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు సారవకోట మండలం మాళువ రెవెన్యూ పరిధిలో ప్రవహిస్తున్న మహేంద్రతనయ నదితో పాటు పొగడవిల్లి, పెద్దగెడ్డల్లో వరద ఉద్ధృతి శనివారం ఉదయం పెరగడంతో మాళువ, నౌతళ, దనుపురం గ్రామాల్లోని 100 ఎకరాల్లో వరి పొలాలు నీట మునిగాయి. కనుచూపు మేరలో నీరు పొలల్లో నిల్వ ఉండటంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. మెళియాపుట్టి, పాతపట్నం, ఒడిశా ప్రాంతంలో వర్షం అధికంగా కురవడంతో నీటి ప్రవాహం పెరిగిందని రైతులు తెలిపారు. వరద ఉద్ధృతికి కాలువలకు పలుచోట్ల గండ్లు పడినట్లు వారు తెలిపారు. దిగువన ఉన్న వంశధార గొట్టాబ్యారేజీకు మహేంద్ర తనయ, పొగడవెళ్లి, పెద్దగెడ్డ నీరు చేరాల్సి ఉండగా, గొట్టాబ్యారేజీలో నీటి నిల్వతో నీరు పోటెత్తినట్లు వారు తెలిపారు. వరి పొలాలు నీట మునిగిన విషయాన్ని తెలుసుకున్న ఏవో మురళీధర్, రెవెన్యూ అధికారులు పరిశీలించారు.



నీటిలో ఉన్న వరిచేను

కుద్దిగాంలో వ్యక్తి ఆత్మహత్య



మృతి చెందిన కరిమి శ్రీనివాసరావు

కొత్తూరు, న్యూస్‌టుడే : మండలంలోని కుద్దిగాం గ్రామానికి చెందిన కరిమి శ్రీనివాసరావు (40) అనే వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. భార్య కమలమ్మ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై డి.విజయకుమార్ శనివారం తెలిపారు. ఆయన తెలియజేసిన వివరాల మేరకు... కుద్దిగాంకు చెందిన శ్రీనివాసరావుకు ఆర్థిక ఇబ్బందులు వెంటాడుతుండేవని, వీటిని అధిగమించేందుకు చెన్నై పట్టణానికి వలస వెళ్లినట్లు తెలిపారు. అక్కడ సైతం ఆశించిన ఉపాధి దొరక్క పోవడంతో ఇబ్బందులు తీరలేదు. ఈ నేపథ్యంలో ఇటీవల గ్రామానికి చేరుకున్నారని, జీవితంపై విరక్తి చెంది 23వ తేదీన అందుబాటులో ఉన్న పురుగుల మందు తాగినట్లు తెలిపారు. బంధువులు కొత్తూరు ఆసుపత్రికి తరలించి అక్కడ నుంచి శ్రీకాకుళం ఆసుపత్రిలకు తరలించి చిక్సిత అందించినా ఫలితం లేకపోయిందన్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి, బంధువులకు అప్పగించినట్లు ఆయన తెలిపారు. శ్రీనివాసరావుకు ఇద్దరు పిల్లలున్నారు. శ్రీనివాసరావు మృతితో కుద్దిగాం గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది.

విద్యుదాఘాతంతో రైతు మృతి



టున్నా బద్యో మృతదేహం

బిర్లంగి (ఇచ్ఛాపురం), న్యూస్‌టుడే: వేలాడే విద్యుత్తు తీగలు శుక్రవారం ఓ రైతును బలిగొన్నాయి. మండలంలోని బిర్లంగి గ్రామంలో చెరువుగట్టు మీదుగా వెళుతున్న విద్యుత్తుతీగలు ప్రమాదకరంగా మారాయని, ఉపాధి కూలీలు మొరపెట్టినా, అధికారులు పట్టించుకోలేదని, అందువల్లే రైతు మృత్యువాత పడ్డాడని బిర్లంగి గ్రామస్థులు ఆందోళన వ్యక్తంచేశారు. శుక్రవారం పొలం పనులు ముగించుకొని చెరువుగట్టు మీదుగా ఇంటికి తిరిగివస్తున్న రైతు టున్నా బద్యో(45)కు వేలాడుతున్న విద్యుత్తు తీగలు తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. టున్నాబద్యో సోదరుడు కృష్ణ బద్యో ఇచ్చిన ఫిర్యాదుమేరకు రూరల్ ఎస్సై ఎం.చిన్నమనాయుడు కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నారు. వినాయక చవితి రోజునే ఈ దుర్ఘటన జరగడంతో గ్రామస్థులు విషాదంలో మునిగిపోయారు. శనివారం ఉదయాన్నే గ్రామానికి చేరుకున్న విద్యుత్తు పంపిణీ సంస్థ సిబ్బంది తీగలు సరిచేశారు. ఈ నిరుపేద కుటుంబాన్ని ఆదుకోవాలని సర్పంచి దూపాన నీలాద్రిరెడ్డి, సూర్యనారాయణ, బాకీ లక్ష్మీనారాయణ కోరుతున్నారు.

వెనకేసుకొస్తున్నారా!

(మొదటి పేజీ తరువాయి) సైతం సిద్ధపడ్డారు. ఈ భూ కుంభకోణంపై 'ఈనాడు'లో వెలువడిన కథనాలపై స్పందించిన యంత్రాంగం నలుగురిపై క్రిమినల్ కేసులు పెట్టేందుకు సిద్ధమయింది. మరో వైపు పై నలుగురి పేరుతో ఉండే అడంగల్ నెంబర్లకు ఎటువంటి రిజిస్ట్రేషన్లు జరపరాదని కాశీబుగ్గ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి పలాస తహసీల్దార్ కల్యాణచక్రవర్తి లేఖ రాశారు. ఆ తరువాత చోటుచేసుకున్న పరిస్థితుల నేపథ్యంలో దర్యాప్తు నీరుగారుతుందనే ప్రచారం జరుగుతోంది. కుంభకోణం అంశం వెలుగులోకి వచ్చి 20 రోజులు పైబడింది. రైతుల పేరున ఉన్న భూములకు సంబంధించిన సర్వే నెంబర్ల దస్త్రాలు మార్చేసి విక్రయానికి సిద్ధమయిన నలుగురిపై క్రిమినల్ కేసులు పెట్టేందుకు రెవెన్యూ యంత్రాంగం ఎందుకు వెనకడుగు వేస్తోంది? దాదాపు రూ.10 కోట్ల భూ కుంభకోణంపై ఇంత ఉదాసీనతగా ఉంటారా అనే ఆరోపణలొస్తున్నాయి.

ఆదేశాలు రావలసి ఉంది: తోటూరు రెవెన్యూ పరిధిలో జరిగిన వ్యవహారంపై జిల్లా సంయుక్త కలెక్టర్‌కు నివేదించాం. అక్కడి నుంచి ఆదేశాలు వచ్చాక... అక్రమంగా దస్త్రాలు మార్పిడికి పాల్పడిన వారిపై తప్పకుండా క్రిమినల్ కేసులుంటాయి. కొంత మంది సిబ్బందిపై కూడా చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

– వెంకటేశ్వరరావు, ఆర్డీవో, టెక్కలి

28 నుంచి వ్యాయామ ఉపాధ్యాయులకు కార్యశాల

బలగ (శ్రీకాకుళం), న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరంలోని అంబేడ్కర్ ఆడిటోరియంలో ఈ నెల 28 నుంచి మూడు రోజుల పాటు వ్యాయామ ఉపాధ్యాయులకు సెమినార్, కార్యశాల (వర్క్‌షాప్) నిర్వహిస్తున్నట్లు వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.వి.రమణ ఒక ప్రకటనలో తెలిపారు. సెమినార్‌కు హాజరయ్యేవారు గ్రిగ్స్ పోటీలకు సంబంధించిన వివరాలతో రావాలని కోరారు.


గొట్టాబ్యారేజ్ నుంచి దిగువకు విడిచిపెట్టిన నీరు


లాబర కోనేరుకు పండిన గండి

భారీ వర్షంతో చెరువులకు గండ్లు

- పోటెత్తిన మహేంద్రతనయ..
- పొంగిపొర్లిన గెడ్డలు, చెరువులు
- నీటిలో మునిగిన పంటపొలాలు
- రాకపోకలకు అంతరాయం


కొట్టుకుపోయిన సుర్జిని రహదారి

హిరమండలం, న్యూస్‌టుడే : మహేంద్రతనయ నదిలో వరద నీరు పోటెత్తడంతో ఒక్కసారిగా వంశధార నది గొట్టాబ్యారేజి వద్ద వరద ప్రవాహం పెరిగింది. దీంతో గొట్టాబ్యారేజి వద్ద శనివారం 15 వేల క్యూసెక్కులు ఇన్‌ఫ్లో నమోదైంది. గొట్టాబ్యారేజి వద్ద 22గేట్లు ఎత్తివేసి 14000వేల క్యూసెక్కులు దిగువకు విడిచిపెడుతున్నట్లు డీఈఈ ఎం. ప్రభాకర్ చెప్పారు. పొగడవెల్లి గెడ్డ పోటెత్తడంతో పంటలు నీట మునిగాయి. పంట పొలాల గట్లు,కాలువలకు గండ్లు పడ్డాయి. నవతల కూడలి నుంచి హిరమండలం వైపు వచ్చే రహదారి, నరసన్నపేట-పాతపట్నం రహదార్లు నీటమునిగాయి. వాహనాల రాకపోకలు అంతరాయం కలిగింది. సారవకోట మండలం నవతల, మాళువ రెవెన్యూ, హిరమండలం మండలం ధనుపురం, కల్లట, తంప గ్రామాలకు చెందిన రైతుల పంట భూములు నీట మునిగాయి. కల్లట వద్ద రహదారి శిథిలమైంది.

మెళియాపుట్టి, న్యూస్‌టుడే: మండలంలోని గోకర్ణపురం-గొప్పిలి గ్రామాల మధ్య గెడ్డ ఉధృతంగా ప్రవహించింది. గ్రామానికి చెందిన బురగాన ప్రకాశరావు ప్రవాహంలో కొంత దూరం కొట్టుకుపోయి. చివరకు ప్రాణాలతో బయటపడ్డాడు. సుందరాడ పంచాయతీ చింతపల్లి గిరిజన గ్రామానికి రాకపోకలు నిలిచాయి. శేఖరాపురం గ్రామానికి బగడ గెడ్డ ప్రవాహం వల్ల రాకపోకలు ఆగిపోయాయి. మండలంలో చెరువులు, గెడ్డలు ప్రవాహపు నీటితో పోటెత్తాయి. బాణాపురం పంచాయతీ సుర్జిని గ్రామానికి 6నెలలు క్రితం వేసిన రహదారి కొట్టుకుపోయింది. దీంతో రాకపోకలు స్థంభించాయి. దీనంబందుపురం పంచాయతీ పరిధిలోని కుడ్డబ గ్రామానికి ఆనుకొని ఉన్న చావకబంద చెరువుకు భారీగా గండిపడింది.


ధనుపురం వద్ద రహదారిపై ఇలా..

పాతపట్నం, న్యూస్‌టుడే: పాతపట్నం మండలంలో శుక్రవారం సాయంత్రం 4.30 గంటలకు ప్రారంభమైన వర్షం రాత్రి 8.30 గంటల వరకు ఎడతెరిపిలేని కుండపోతగా వర్షం కురిసింది. పొగడవెల్లి గెడ్డ పొగడంతో లోతట్టు ప్రాంతాలైన సింగుపురం, పెద్దలోగిడి, బోరభద్ర పంచాయతీల్లో సుమారు ఆరు చోట్ల గండ్లు పడ్డాయి. సుమారు రెండువందల ఎకరాల్లో వరి పంట పొలాలను ముంపునకు గురిచేసింది. లాబర గ్రామ సరిహద్దులో చెరువుకు వర్షపునీరు చేరుకొని గట్టు కోతకు గురిచేసింది.


గండి పడిన కుడ్డబలో చావకబంద చెరువు


గోకర్ణపురంలో వంతెనపై నుంచి ప్రవహిస్తున్న వరద నీరు

విజయనగరంలో సెప్టెంబరు 10న వెలమ వధూవరుల వివాహ పరిచయ వేదిక

వెలమ కమ్యూనిటీలో సంబంధాలను అన్వేషించే వారి సౌకర్యార్థం ఈనాడుపెళ్లిపందిరి.నెట్ విజయనగరంలో సెప్టెంబరు 10న పరిచయ వేదిక నిర్వహిస్తోంది.

వేదిక : హోటల్ మయూర, ట్యాంక్‌బండ్ రోడ్, ఆర్.టి.సి. కాంప్లెక్స్ దగ్గర, విజయనగరం.

వధువు/వరుడు, వారి ఇష్టాఇష్టాల పరిచయం. వధువు/వరుడు వివరాలతో కూడిన సి.డి. ఇస్తారు. ఈనాడుపెళ్లిపందిరి.నెట్ వెబ్‌సైట్ ద్వారా మీకు నచ్చిన 10 'కాంటాక్ట్ నెంబర్స్' 30 రోజుల కాల వ్యవధిలో పూర్తి ఉచితంగా చూసుకునే అవకాశం. ఈనాడుపెళ్లిపందిరి.నెట్ ద్వారా వివాహం జరిగిన వారు 3 నెలల లోపు తెలియచేస్తే రూ. 2500/- విలువ గల బహుమతి కూపన్ అందజేస్తారు.

పరిచయవేదికకు వచ్చిన వధువు/వరుడుతో కలిపి ముగ్గురు వ్యక్తులకు భోజన వసతి. రిజిస్ట్రేషన్ల సంఖ్య పరిమితం. రుసుం ర్వూ 1900/-.

రిజిస్ట్రేషన్‌కు వచ్చునపుడు వధువు/వరుడుల ఐ.డి.ప్రూఫ్ (ఆధార్ కార్డ్/పాస్‌పోర్ట్/డ్రైవింగ్ లైసెన్స్/ఓటర్ కార్డ్) తీసుకురావాలి.

ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకొనే వారికి 10% తగ్గింపు కలదు. 10% తగ్గింపు పొందేందుకు ఆఖరు తేది: 31-08-2017.


మరిన్ని వివరాలకు సంప్రదించండి: ఈనాడు ఆఫీస్, ఆర్.కె. ప్లాజా, 1వ అంతస్తు, మయూరి జంక్షన్, విజయనగరం. ఫోన్స్ : 7993194026, 8008550133, విశాఖపట్నం : 8008550215, రాజమహేంద్రవరం : 8008551135, కాకినాడ : 8008550135, శ్రీకాకుళం : 8008550133.

వరుడు లేదా వధువులకు సంబంధించిన కార్డ్ సైజ్ ఫొటో తప్పక వెంట తీసుకురావాలి. నిరంతరం ప్రత్యక్ష సేవలు, సమాచారం కోరు వారికి నిర్ణీత రుసుంతో ప్యాకేజీలు కూడా లభ్యమవుతాయి.

రిజిస్ట్రేషన్స్ ఆన్‌లైన్‌లో కూడా చేసుకోవచ్చు. www.eenadupellipandiri.net

నేడు జిల్లా స్థాయి ఈత క్రీడాకారుల ఎంపికలు

శ్రీకాకుళం క్రీడలు, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరంలోని శాంతినగర్ కాలనీ సమీపాన ఉన్న ఈత కొలనులో ఆదివారం (నేడు) జిల్లా స్థాయి క్రీడాకారుల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా స్విమ్మింగ్ అసోషియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు హారికా ప్రసాద్, కాంతారావు తెలిపారు. ఉదయం 9 గంటలకు ఎంపిక ప్రక్రియ ప్రారంభం కానుందని వారు పేర్కొన్నారు. బాల బాలికల విభాగాల్లో ఎంపిక జరుగుతాయన్నారు.


భిన్నవర్ణాల శోభిత

మెళియాపుట్టి మండలంలోని జోడూరు పంచాయతీ రాజపురం గ్రామంలో సీతాకోకచిలుక ఇలా భిన్నవర్ణాలతో కనిపించి కనువిందు చేసింది. విభిన్న రంగులతో భిన్నమైన రెక్కల ఆకృతితో ఆకట్టకుంది.

- జోడూరు(మెళియాపుట్టి), న్యూస్‌టుడే

వ్యాపారానికి వంట గ్యాస్... నిబంధనలు తుస్..!



పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల్లో వంట గ్యాస్‌ను కొందరు వ్యాపారులు వాణిజ్యపరంగా యథేచ్ఛగా వినియోగిస్తున్నారు. ప్రభుత్వం గృహ వినియోగదారులకు రాయితీపై పంపిణీ చేస్తున్న వంట గ్యాస్ సిలెండర్లను కొందరు పక్కదారి పట్టిస్తున్నారు. కె.టి.రోడ్డులోని ఓ చెత్త దుకాణం వద్ద వంట గ్యాస్‌ను వినియోగించి ఇనుపచువ్వలు కత్తిరిస్తున్న ఓ వ్యాపారి చిత్రమే ఇందుకు నిదర్శనం.

–కాశీబుగ్గ, న్యూస్‌టుడే